జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి మంగళవారం 27 జనవరి 2026 సంపుటి : 1 సంచిక : 27 వెల: రూ.5 పేజీలు: 08

RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

# జోడు గుర్రాల్లా సంక్షేమం.. వ్యవసాయం

## మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటీ రంగాల్లోనూ పురోభివృద్ధి



- రెండేళ్లలో తెలంగాణలో విశేష ప్రగతి
- రూ.20,617 కోట్లతో 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ
- వరి ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానం
- 62,749 మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు
- రూ.500కే సిలిండర్‌తో 42.90 లక్షల కుటుంబాలకు లబ్ధి
- బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు నిజమైన నివాళి
- గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



హైదరాబాద్

"గత రెండేళ్లలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, వ్యవసాయం, మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటీ రంగాల్లో విశేష పురోగతిని సాధించింది. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది" అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో సోమవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ, రాష్ట్ర గీతాలాపన అనంతరం... సైనిక, వైమానిక దళాలు, రాష్ట్ర పోలీసులు, కొత్తగా ఏర్పడిన డిజాస్టర్ ఫోర్స్, ఎన్‌సీసీ క్యాడెట్లు, గురుకుల విద్యార్థుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. అంతకు ముందు గవర్నర్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎస్ కె.రామకృష్ణారావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైనిక అమరవీరుల స్థూపం వద్ద ఉప ముఖ్యమంత్రితో కలిసి నివాళి అర్పించారు. ఉత్తమ కవాతు ప్రదర్శనకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ - మిగతా 2లో



# స్టూడెంట్‌గా రేవంత్!

- పుస్తకాలు చేతబట్టి హార్వర్డ్ యూనివర్సిటీ క్లాసులకు..
- '21వ శతాబ్దంలో నాయకత్వం' అంశంపై కోర్సు
- 30వ తేదీ దాకా క్లాసులు.. తొలి రోజు హాజరైన సీఎం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 దాకా తరగతులు
- హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్న తొలి సీఎంగా రికార్డు.. 2న రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి

2లో



# భారత్, ఈయూ చారిత్రక వాణిజ్య డీల్

- నేడు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలితో ప్రధాని మోదీ భేటీ
- యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతోనూ చర్చలు
- తర్వాత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అధికారిక ప్రకటన

5



# భారత్‌తో ట్రేడ్ డీల్‌కు ఆ ముగ్గురూ అడ్డుపడ్డారు

- ట్రంప్ పై సెనేటర్ విమర్శలు
- ట్రంప్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు
- అధ్యక్షుడిపై ఆరోపణలు గుప్పించిన టెక్సస్ సెనేటర్ టెడ్ క్రూజ్
- టారిఫ్‌లు వద్దన్నందుకు ట్రంప్ తనపై అరిచాడని వెల్లడి




# గణతంత్ర వేడుకల్లో 'సిందూర' స్ఫూర్తి!

- కర్తవ్యపథ్‌లో ఘనంగా వేడుకలు ప్రధాన ఆకర్షణగా సిందూర్ శకటం
- బ్రహ్మోస్ నుంచి సూర్యాస్త్ర దాకా అలరించిన ఆయుధ వ్యవస్థలు
- అమేయ సైనిక శక్తికి, యుద్ధ సన్నద్ధతకు అద్దం పట్టిన కవాతు
- సాంస్కృతిక వైవిధ్యానికి తార్కాణంగా నిలిచిన శకటాలు
- ముఖ్య అతిథులుగా ఈయూ సారథులు ఉర్సులా, కోస్టా
- వారిని సంప్రదాయ బగ్గీలో తోడ్కొని వచ్చిన రాష్ట్రపతి

5లో

## రష్యాలో కార్మికుల కొరత..

- భారీగా భారతీయుల నియామకానికి రంగం సిద్ధం
- కార్మికుల కొరతతో రష్యాలో భారీగా భారతీయ నియామకాలు
- ఈ ఏడాది 40,000 మందిని తీసుకోనున్నట్లు అంచనా
- కార్మికుల తరలింపుపై ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు
- రష్యాలో 30 లక్షల మంది నైపుణ్య నిపుణుల కొరత



5

# లోక్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోమ్

## గవర్నర్ ప్రతిభ పురస్కారాల ప్రదానం



హైదరాబాద్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని లోక్‌భవన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన 'ఎట్ హోమ్' ఘనంగా జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ తదితరులు - మిగతా 2లో

# నేడు షెడ్యూలు!

- సాయంత్రం విడుదల చేసే అవకాశం
- ఉదయం కలెక్టర్లు, మధ్యాహ్నం సీఎస్‌తో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహక సమావేశం
- ఏదైనా అవాంతరం ఏర్పడితే తప్ప మంగళవారం ఎన్నికల షెడ్యూలు విడుదల ఖాయమని ప్రభుత్వవర్గాలు
- ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- నియమనిబంధనల మార్గదర్శకాలూ ఇప్పటికే జారీ



హైదరాబాద్

తెలంగాణలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలలో ఎన్నికలకు షెడ్యూలు వెలువరించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) సన్నద్ధమయింది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సమావేశం నిర్వహించనున్న ఎస్‌ఈసీ మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో భేటీ కానుంది. అనంతరం సాయంత్రం షెడ్యూలు వెలువరించనుంది. ఏదైనా అవాంతరం ఏర్పడితే తప్ప మంగళవారం ఎన్నికల షెడ్యూలు విడుదల ఖాయమని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్ల జాబితాలను ముద్రించారు. పోలింగు కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధంగా ఉన్నాయి. నియమనిబంధనల మార్గదర్శకాలూ జారీ - మిగతా 2లో



# సందడిగా 'ఎట్ హోం'

## విశిష్ట అతిథులకు రాష్ట్రపతి విందు

5లో

# జోడు గుర్రాల్లా సంక్షేమం.. వ్యవసాయం

-మొదటిపేజీ తరువాయి

గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ... "సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రజాప్రభుత్వం గణనీయ విజయాలను సాధించి.. ప్రజల విశ్వాసాన్ని, ప్రశంసలను సంపాదించింది. రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' అనే దార్శనికపత్రాన్ని ఆవిష్కరించింది. సమగ్ర, సుస్థిర అభివృద్ధికి రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. వికసిత్ భారత్ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదేబాటలో తెలంగాణ సైతం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా అవతరించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్... అనే మూడు ప్రాంతాల్లోనూ సమాన అభివృద్ధి సాధించాలని నిర్ణయించుకున్నది.

**ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి**

ప్రభుత్వం సేద్యానికి 24 గంటల విద్యుత్తును సరఫరా చేస్తోంది. రూ.20,617 కోట్ల వ్యయంతో రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేయడం ద్వారా 26 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చింది. రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు అందించే సహాయాన్ని నిరుడు రూ.10,000 నుంచి రూ.12,000కు పెంచింది. సన్నధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో 14.24 లక్షల మంది రైతుల నుంచి 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇప్పటివరకు రూ.17,079.50 కోట్ల చెల్లింపులు జరిగాయి. అదనంగా రూ.1,453 కోట్లను బోనస్‌గా పంపిణీ చేసింది. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు బియ్యాన్ని ఎగుమతి చేస్తూ... అంతర్జాతీయ మార్కెట్లలోనూ తన ఉనికిని చాటింది. ధరణి పోర్టల్ స్థానంలో రైతులకు అనుకూలమైన 'భూభారతి'ని



తీసుకొచ్చింది.

**యువత ఉపాధిపై దృష్టి**

ఇప్పటివరకు 62,749 మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్)ను ప్రారంభించింది. యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించింది. ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేస్తోంది. మొత్తంగా తెలంగాణను ప్రపంచ నైపుణ్య రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోంది.

**మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట**

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇందిరా మహిళాశక్తి మిషన్‌ను అమలు చేస్తోంది. వారి ఆర్థిక కార్యకలాపాలకు మద్దతుగా రూ.40,000 కోట్ల రుణాలకు బ్యాంకులతో అనుసంధానం కల్పించింది. స్వయం సహాయక సంఘాలకు 236 ఇందిరా మహిళాశక్తి కాంటీన్లు, నారాయణపేట, సంగారెడ్డిలలో పెట్రోల్‌బంక్‌లను కేటాయించింది. రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తూ 42.90 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. గృహజ్యోతి ద్వారా 53 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తూ రూ.3,593 కోట్ల సబ్సిడీ ఇచ్చింది. ఇప్పటివరకు వైద్యారోగ్య రంగంలో రూ.16,521 కోట్లు వెచ్చించింది.

**ఎస్సీ వర్గీకరణ అమలు**

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల, ఉద్యోగ సర్వేను విజయవంతంగా నిర్వహించింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలుచేసి దేశానికి ఆదర్శంగా నిలిచింది. సమగ్ర పట్టణాభివృద్ధికి జీహెచ్‌ఎంసీని విస్తరించి 27 మున్సిపాలిటీలను విలీనం చేసింది. కాలుష్య నియంత్రణకు ఈవీలకు 100% పన్నుల్లో మినహాయింపు ఇస్తోంది. రాజ్యాంగం మనకు హక్కులతోపాటు బాధ్యతలనూ కల్పించింది. బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు మనమందించే నిజమైన నివాళి. ప్రజలు శాంతి, గౌరవం, సౌభాగ్యంతో జీవించాలి" అని ఆకాంక్షించారు.

# వీబీజీ రామ్‌జీకి సవరణలు రావొచ్చు

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ) చట్టానికి సవరణలు చేస్తుందని ఆశిస్తున్నామని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ పేర్కొన్నారు. ఈ చట్టం ఇంకా సమగ్రరూపం తీసుకోలేదని భావిస్తున్నామన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ చట్టం స్థానంలో తెచ్చిన ఈ చట్టంపై అధికార పక్ష (బీజేపీ) నేతల్లోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని చెప్పారు. వీబీజీ రామ్‌జీ చట్టంలో తెచ్చిన కొన్ని మార్పులు చింతాజనకంగా ఉన్నా యని అభిప్రాయపడ్డారు. నిధులు, విధానాలు, ఇతర అంశాల పరంగా కేంద్రం తన పాత్రను తగ్గించుకోవడం సరికాదని చెప్పారు. కేంద్రం నిధుల తగ్గింపు వల్ల పేద రాష్ట్రాలు ఈ పథకానికి చేసే వ్యయం తగ్గుతుందని, దీంతో పేదరికాన్ని తగ్గించాలనే లక్ష్యం నెరవేరదని చెప్పారు. సోమవారం హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్2026 (హెచ్‌ఎల్‌ఎఫ్) ప్లీనరీలో భాగంగా... అభిజిత్ బెనర్జీ రచించిన 'చౌంక్: ఆన్ ఫుడ్, ఎకనమిక్స్ అండ్ సొసైటీ'పుస్తకంపై జరిగిన చర్చలో హెచ్‌ఎల్‌ఎఫ్ డైరెక్టర్ బి.కిన్నెరమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

**హైదరాబాద్ బిర్యానీ బెస్ట్**

కిన్నెరమూర్తి చర్చను ప్రారంభిస్తూ అభిజిత్ పుస్తకంలో దక్షిణాది మరీ ముఖ్యంగా తెలంగాణ వంటకాలను భాగం చేయకపోవడంపై తాము ఫిర్యాదు చేస్తున్నామన్నారు. భారత్ వైరుధ్యాలతో కూడిన దేశమని, పేదల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం భారత్ ఉన్న పరిస్థితుల్లో మెరిట్ అనేది అసంబద్ధమైన పదంగా మారిందని, మెరిట్ అనేది సామాజిక పరిస్థితుల నుంచి



ఉద్భవించిందని అభిజిత్ పేర్కొన్నారు. తన తల్లిదండ్రులిద్దరూ టీచర్లు కావడంతో ఇంట్లో పుస్తకాలనేవి తనకు ఒక ప్రివిలేజ్‌గా లభించాయన్నారు. తాను ఆయా వంటకాలపై రచనలు చేయడమే కాదు... దక్షిణ భారత వంటలు కూడా బాగా తయారుచేయగలనని చెప్పారు. భారత్‌లో రిజర్వేషన్ల పాలసీ అనేది ఉద్రిక్తతలకు దారితీస్తోందని, ఇది చాలామందికి నచ్చడం లేదన్న ప్రశ్నకు అభిజిత్ స్పందిస్తూ... మధ్యతరగతి కోరుకుంటున్న ఉద్యో గాలు దొరకక, ప్రభుత్వరంగంలోనే కాక ప్రైవేట్‌రంగంలోనూ తగిన ఉద్యోగాలు లభించక నిరుద్యోగం పెరగడంతో ఈ సమస్య తీవ్రమవుతోందన్నారు. బియ్యం ధరల పెరుగుదల ఒకందుకు మంచిదేనని, దీనివల్ల ఇతర ఆహార ప్రాధాన్యతల వైపు మళ్లే అవకాశం ఉంటుందన్నారు. వరి పంటలు అధికంగా వేయడం వంటివి పరోక్షంగా గ్లోబల్ వార్మింగ్ వంటి విపరిణామాలకు దారితీస్తుందనే విషయాన్ని గ్రహించాలని చెప్పారు. హైదరాబాద్ బిర్యానీకి ఏ రేటింగ్ ఇస్తారని ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ అడిగిన ప్రశ్నకు అభిజిత్ స్పందిస్తూ... దేశంలో ఒక్కోచోట ఒక్కోరకమైనది అందుబాటులో ఉన్నా ప్రత్యేక సందర్భాల్లో బిర్యానీ తీసుకోవాలని.. అలాంటి సందర్భాల్లో హైదరాబా ద్ బిర్యానీని బెస్ట్‌గా పరిగణిస్తామని బదులిచ్చారు.

# మళ్లీ హౌసింగ్ బోర్డు ఫ్లాట్లు!

హైదరాబాద్

ఒకవైపు పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం.. అల్పాదాయ(ఎల్‌ఐజీ), మధ్య తరగతి(ఎంఐజీ), అధిక ఆదాయ(హెచ్‌ఐజీ) వర్గాలకూ సరసమైన ధరలకు ఇళ్లను అందించాలని భావిస్తోంది. ఈ మేరకు హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే వరంగల్ జిల్లాలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉన్న 25 ఎకరాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని హౌసింగ్ బోర్డు భావిస్తోంది. మొదటిదశలో 10 ఎకరాల్లో జీ ప్లస్ 5 లేదా జీ ప్లస్ 6 అంతస్తుల విధానంలో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తే.. ఎన్ని ఫ్లాట్లు అందుబాటులోకి వస్తాయనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రాథమికంగా ఒక నివేదికను రూపొందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జాయింట్ వెంచర్ విధానంలో నిర్మించిన ఇళ్లలో బోర్డుకు వచ్చిన వాటా ఇళ్ల విక్రయాలకు మంచి ఆదరణ వచ్చింది. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఖమ్మం, వరంగల్ పరిధిలో ఉన్న ఫ్లాట్ల కొనుగోలుకు అధిక దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలోనే స్థలం ఉన్న చోట మళ్లీ ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ వర్గాల కోసం ఇళ్లను నిర్మిస్తే బోర్డుకు ఆదాయం రావడంతోపాటు ఆయా వ ర్గాలకు సరసమైన ధరల్లోనే సొంతింటి కలను నెరవేర్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా వరంగల్ జిల్లాలో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు శ్రీకారం చుడుతోంది.

**700 ఫ్లాట్లు.. 7లక్షల చదరపు అడుగులు**

అఫర్డబుల్ హౌసింగ్ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇందుకోసం ప్రస్తుతం డ్రాఫ్టింగ్ జరుగుతోంది. ఒకవైపు ఈ ప్రక్రియ జరుగుతుండగానే.. వరంగల్‌లో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని హౌసింగ్ బోర్డు భావిస్తోంది. మొదటి విడతలో కుడా పరిధిలోని 10 ఎకరాల్లో అపార్ట్‌మెంట్లను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. వాటిలో అల్పాదాయ వర్గాల కోసం 650 చదరపు అడుగుల చొప్పున 300 ఫ్లాట్లు, మధ్య ఆదాయ వర్గాల కోసం 1000 చదరపు అడుగుల చొప్పున 200 ఫ్లాట్లు, అధిక ఆదాయ వర్గాల కోసం 1,600 చదరపు అడుగుల చొప్పున మొత్తం 200 ఫ్లాట్లను నిర్మించాలని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. అన్ని వర్గాలకు కలిపి 7,15,000 చదరపు అడుగుల్లో, మొత్తం 700 ఫ్లాట్లను నిర్మించనున్నారు. ఎల్‌ఐజీ ఫ్లాట్‌కు రూ.19.20లక్షలు, ఎంఐజీ ఫ్లాట్‌కు రూ.30 లక్షలు, హెచ్‌ఐజీ ఫ్లాట్‌కు రూ.57.45లక్షల చొప్పున ధర ఖరారు చేయగా, వీటి ద్వారా రూ.235 కోట్ల వరకు వస్తాయని అంచనా వేశారు. అయితే, ఈ నివేదికలో కొన్ని మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మొదటిదశలో నిర్మించాలని భావి స్తున్న వాటిలోనూ ఫేజ్-1లో 280, ఫేజ్-2లో 420 ఫ్లాట్ల చొప్పున నిర్మించాలని యోచిస్తున్నారు. సాధ్యా సాధ్యాలన్నింటినీ సమగ్ర నివేదికలో పొందుపర్చి త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు తెలిసింది. కాగా సర్కారు ఆమోది ంచాక.. అపార్ట్‌మెంట్ల డిజైన్ రూపొందించి, ఆసక్తి ఉన్నవారి నుంచి కొంత డిపాజిట్ సేకరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా అన్ని వివరాలతో కూడిన నోటిఫికేషన్‌ను విడుదల

## నేడు షెడ్యూలు!

-మొదటిపేజీ తరువాయి

అయ్యాయి. ఫిబ్రవరి 15 లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో 'ఫిబ్రవరి 11' పోలింగుకు అనుకూలంగా ఉంటుందని ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లు నివేదించారు. 11న ఎన్నికలు జరిగితే 13న ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. దీనికి అనుగుణంగా షెడ్యూలు విడుదల కానున్నట్లు తెలిసింది. మంగళవారం ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు పూర్తి చేశారు. చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ సైతం పూర్తయింది.

## స్టూడెంట్‌గా రేవంత్!

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన కాలేజీ రోజులు గుర్తుకొచ్చి ఉంటాయి కావొచ్చు! కారణం.. ఆయన మళ్లీ కాలేజీ విద్యార్థిగా మారారు. అదీ అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం స్టూడెంట్‌గా! చక్కగా మెడలో ఐడీ కార్డు వేసుకొని.. పుస్తకాలు చేతబట్టి సోమవారం పొద్దుపొద్దున్నే భారీగా కురుస్తున్న మంచు మధ్య వణికించే చలిలో హార్వర్డ్ పరిధిలోని మసాచుసెట్స్‌లోని కెనడీ స్కూల్‌కు వెళ్లారు. అక్కడ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పట్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థిగా మూడేళ్లపాటు హైదరాబాద్ జేఎన్‌టీయూలో తరగతులకు హాజరైన రేవంత్, ఇప్పుడు సీఎం హోదాలో రోజుల వ్యవధిలోనే హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయనున్నారు. ఆ కొన్ని రోజుల్లోనే క్లాసులు విని.. హోంవర్కులు రాసి, అసైన్‌మెంట్‌లు పూర్తిచేసి.. వాటిని క్లాసులో సమర్పించి ప్రఖ్యాత వర్సిటీ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్నారు. వర్సిటీ నిర్వహించే "లీడర్‌షిప్ 21- సెంచరీ" అనే కోర్సుకు సంబంధించి కెనడీ స్కూల్ ప్రాంగణంలో క్లాసులు సోమవారం మొదలయ్యాయి. ఈ క్లాసులు 30వ తేదీ వరకు జరుగుతాయి. ఈ కోర్సు కోసం ఐదు ఖండాల నుంచి 20 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరందరితో కలిసి సోమవారం మొదలైన క్లాసులకు రేవంత్ హాజరయ్యారు. సీఎం పదవిలో కొనసాగుతూ హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఒక కోర్సు సర్టిఫికెట్ అందుకున్న సీఎంగా రేవంత్ రికార్డు సృష్టించనున్నారు. తొలిరోజు పరిచయ కార్యక్రమాల అనంతరం కోర్సులో భాగంగా "తావీవీధికార విశ్లేషణ.. నాయకత్వం" అంశంపై తొలిసెషన్ ప్రారంభమైంది. ఉదయం ఏడింటికే మొదలైన తరగతులు సాయంత్రం ఆరింటిదాకా కొనసాగాయి. కేస్ అనాలసిస్ సహా వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్‌వర్క్ వంటి కార్యక్రమాల్లో ప్రతినిధులు పాల్గొన్నారు. కోర్సులో భాగంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుంచి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. ఆ తర్వాతే కోర్సు ముగుస్తుంది. ఆపై.. యూనివర్శిటీ నుంచి సీఎం రేవంత్ సర్టిఫికెట్ పొందనున్నారు. అనంతరం ఆయన అమెరికా నుంచి తిరుగు ప్రయాణమవుతారు. ఫిబ్రవరి 2న ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. కాగా క్లిష్టమైన పరిస్థితుల్లో ఎలాంటి నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలి? అనిశ్చిత పరిస్థితులను, అనుకోని మార్పులను ఎలా ఎదుర్కోవాలి? సంబంధించిన అంశాలు కోర్సులో ఉంటాయి. ఇది రాజకీయ నాయకులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు, కార్పొరేట్ కంపెనీల సీఈవోలు, డైరెక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఉపయుక్తంగా ఉంటుంది.

**హార్వర్డ్ విశేషాలు..**

హార్వర్డ్ యూనివర్శిటీ పరిధిలోని ప్రైవేటు ఐవీ లీగ్ పరిశోధన విశ్వవిద్యాలయం మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జిలో ఉంది. దీనిని 1607లో స్థాపించారు. అంటే దాదాపు 418 ఏళ్ల చరిత్ర కలిగిన యూనివర్శిటీ ఇది. గత వందేళ్లలో దాదాపు 75 సార్లు ప్రపంచంలో నంబర్‌వన్ విశ్వవిద్యాలయంగా నిలిచింది. దీని పరిధిలో 14 కళాశాలలున్నాయి. బిజినెస్ (హెచ్‌బీఎస), లా (హచ్‌ఎల్‌ఎస), మెడికల్, గవర్నమెంట్, థియాలజీ శాస్త్రాలకు విడి విడిగా కళాశాలలు ఉన్నాయి. కాగా కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను 1936లో స్థాపించగా, 1966లో అధ్యక్షుడు కెనడీ పేరును పెట్టారు. స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో దాదాపు 100కు పైగా దేశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. కాగా ప్రస్తుతం బోస్టన్‌లో భారీ మంచు తుపాను (ఫెర్న్) కారణంగా రెండు అడుగులకు పైగా మంచు కురిసినట్లు సమాచారం. ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీలకు పడిపోయాయి.

## లోక్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోమ్

-మొదటిపేజీ తరువాయి

హాజరవగా... వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులు సాదరంగా స్వాగతం పలికారు. తేనీటి విందుకు ముందు లోక్‌భవన్ హాలులో వీరితో గవర్నర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం అసెంబ్లీ హాలులో పలువురికి 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2025' ప్రదానం చేశారు. వ్యక్తిగత విభాగంలో రమాదేవి కన్నెగంటి(మహిళా సాధికారత), తోడసం కైలాష్(గిరిజనాభివృద్ధి), డాక్టర్ ప్రద్యుమ్న వాఘ్రే(రూరల్ హెల్త్ అండ్ మెడికల్ ఫిలాంత్రపీ), వి.రాజన్న(కార్పొరేట్ వాలంటీరింగ్), సంస్థాగత విభాగంలో... సాయి సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ-ఘట్‌కేసర్(మహిళా సాధికారత), ఇండిజీనస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(ఐడీవో) గట్టుమల్ల(వి)-భద్రాద్రి జిల్లా(గిరిజనాభివృద్ధి), రామ్‌దేవ్‌రావు హాస్పిటల్-హైదరాబాద్(రూరల్ హెల్త్ అండ్ మెడికల్ ఫిలాంత్రపీ), గివ్ ఫర్ సొసైటీ-ఘట్‌కేసర్(కార్పొరేట్ వాలంటీరింగ్)లకు గవర్నర్ అవార్డులను అందజేశారు. ప్రతి అవార్డుకు రూ.2 లక్షల నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, డాక్టర్ జీవీ రావు, డాక్టర్ విజయానంద్ పి.రెడ్డి, దీపికారెడ్డి సహా పలువురు స్వాతంత్ర్య సమరయోధులను గవర్నర్ సత్కరించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, హర్కర వేణుగోపాల్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాలె యాదయ్య, భారాస ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఆ పార్టీ ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్.రమణ, భాజపా ఎంపీ ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, టీజీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, గవర్నర్ కార్యదర్శి దానకిశోర్, విశ్రాంత ఐఏఎస్‌లు, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## అణు ఇంధనంపై అపోహలు పోగొట్టాలి

హైదరాబాద్

"అణు ఇంధనం గురించి ప్రజల్లో భయం, అపోహలు ఉన్నాయి. రష్యా, జపాన్‌లలో భారీ అణు ప్రమాదాలను, వాటి పర్యవసానాలను చూసినందున భయం ఉండటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ అపోహలు ఉండనక్కర్లేదు. నిత్యం వేల విమానాలు ఎగురుతుంటే అప్పుడప్పుడు ఒక ప్రమాదం జరుగుతోంది. అంతమాత్రాన విమాన ప్రయాణం మానేస్తున్నామా? ప్రస్తుత సాంకేతికత, ఇంధన అవసరాల దృష్ట్యా.. మెరుగైన జీవితం గడపాలంటే అంతరాయం లేని కరెంట్ కావాలి. ఇందుకోసం థర్మల్ ప్లాంట్లపై ఇప్పటికీ ఎక్కువగా ఆధారపడుతున్నాం. పవన, సౌర, అణు ఇంధనమే ప్రత్యామ్నాయం. పర్యావరణహితమైన అణు ఇంధన వినియోగం పెరగాలి. సాంకేతికత ద్వారా ప్రమాదాలు సాధ్యమైనంత వరకు తగ్గేలా.. పకడ్బందీ పర్యవేక్షణ ఉండేలా.. ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. శాస్త్ర పరిశోధనలపై అపోహలను దూరం చేయాల్సి ఉంది" అని హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్) అణు ఇంధన విభాగంలోని రాజారామన్న ఛైర్ డాక్టర్ సత్యనారాయణ భీసెట్టి అన్నారు. ఆయన ముంబయిలోని టీఐఎఫ్ఆర్‌లో 42 ఏళ్లు శాస్త్రవేత్తగా పలు పరిశోధనలు చేశారు. పదవీ విరమణ అనంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ సాహితీ ఉత్సవంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు.

# గణతంత్ర వేడుకల్లో 'సిందూర' స్ఫూర్తి!

న్యూఢిల్లీ

ఆపరేషన్ సిందూర్ శకటం, ఆ పోరాటంలో పాక్ పీచమణచిన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు, అతి శక్తిమంతమైన క్షిపణులు, కొత్త తరం యుద్ధ విమానాలు, సరికొత్త సైనిక విభాగాలు... ఇలా అమేయమైన భారత సైనిక శక్తిని 77వ గణతంత్ర దిన వేడుకలు కళ్లకు కట్టాయి. సిందూర్ థీమ్‌తో రూపొందిన భారత సైన్య శకటం అందరినీ ఆకట్టుకుంది. ఇక దేశీయంగా రూపొందించిన పలు ప్రళయ భీకర ఆయుధాలు ఆహూతులను ఆద్యంతం అలరించాయి. ముఖ్యంగా 150 ఏళ్ల వందేమాతరం థీమ్ ఉర్రూతలూగించింది. సోమవారం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు ఇందుకు వేదికగా నిలిచాయి. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లెయన్ ఈసారి గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారిని వెంటబెట్టుకుని సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకలకు విచ్చేశారు. అనంతరం త్రివిధ దళాధిపతి హోదాలో సైనిక వందనం అందుకున్నారు. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, త్రివిధ దళాధిపతులు, సైనిక, ప్రభుత్వ ఉన్నతాధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. పలు రంగాల ప్రముఖులతో పాటు మొత్తం 10 వేల మందికి పైగా వేడుకలకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో 'సారే జహా సె అచ్ఛా', 'కదం కదం బఢాయె జా'వంటి దేశభక్తి గీతాలతో పాటు వందేమాతరం అందరిలోనూ స్ఫూర్తి నింపాయి. 90 నిమిషాల పాటు జరిగిన వేడుకలో 18 సైనిక దళాలు, 13 సైనిక బ్యాండ్లు అలరించాయి. వేడుక అనంతరం రాష్ట్రపతి ప్రత్యేక అతిథులతో పాటుగా గుర్రపు బగ్గీలోనే వెనుదిరగడం విశేషం.

**సాయుధ పాటవం సాహో...**

త్రివిధ దళాల సైనిక పాటవ ప్రదర్శనకు గణతంత్ర వేడుకలు వేదికగా నిలిచాయి. గణతంత్ర పరేడ్‌కు పరేడ్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ సారథ్యం వహించారు... బ్రహ్మోస్ సూపర్ సానిక్ క్షిపణులు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, సూర్యాస్త్ర యూనివర్సల్ రాకెట్ లాంచింగ్ వ్యవస్థ, అర్జున్ యుద్ధ ట్యాంకు, ధనుష్ ఆర్లిటరీ గన్స్, దివ్యాస్త్ర బ్యాటరీ వంటివి అందరినీ అలరించాయి.
100 మందికి పైగా కళాకారులు ప్రదర్శించిన స్ఫూర్తిదాయకమైన 'భిన్నత్వంలో ఏకత్వం'థీమ్ ఆకట్టుకుంది. స్వతంత్ర భారత చరిత్రలోనే తొలిసారిగా సైన్యం 'యుద్ధ వ్యూహ అమరిక'ద్వారా తన పాటవాన్ని పూర్తిస్థాయిలో ప్రదర్శించడం విశేషం.
ఆ క్రమంలో, గత మేలో పాక్ పీచమణచిన ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోషించిన క్షిపణులు, యుద్ధ విమానాలు, ఆయుధ వ్యవస్థలను కళ్లకు కడుతూ రూపొందించిన త్రివిధ దళాల శకటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ సెంటర్, ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో శకటం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. సిందూర్ ఆపరేషన్ వేళ బ్రహ్మోస్ క్షిపణులు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర వ్యవస్థలతో పాటు పాక్‌లోని కీలక నగరాల్లో ఎయిర్ బేస్‌లను నేలమట్టం చేయడం, ఎస్400 డిఫెన్స్ వ్యవస్థలు పాక్‌దాడులను పూర్తిస్థాయిలో అడ్డుకోవడం తెలిసిందే. టీ90 భీష్మ, అర్జున్ యుద్ధట్యాంకులు, బీఎంపీ2 పదాతి దళ వాహనం, నాగ్ క్షిపణి వ్యవస్థ ముందు నడుస్తుండగా తేలికరకం అత్యాధునిక ధ్రువ్, అపాచీ ఏహెచ్64ఈ, ప్రచండ్ హెలికాప్టర్లు వాటికి రక్షణగా సాగాయి. రోబోటిక్ శునకాలు, మానవరహిత యుద్ధ వాహనాలు వాటిని అనుసరించాయి.
- భారీ వాహనాలపై తరలివచ్చిన శక్తిబాణ్, దివ్యాస్త్ర తర్వాత తరపు అత్యాధునిక యుద్ధ సామర్థ్యానికి అద్దం పట్టాయి.
- కొత్తగా ఏర్పడిన భైరవ్ పదాతి దళ బెటాలియన్ కవాతు ఆకట్టుకుంది. సంప్రదాయ పదాతి దళం, ప్రత్యేక దళాల మేలుకలయికగా దీన్ని రూపొందించారు.
- నేవీ, వాయు సేన నుంచి 144 మంది చొప్పున యువ సిబ్బందితో జరిగిన కవాతులు అలరించాయి.
- క్రీస్తుపూర్వం ఐదో శతాబ్దికి చెందిన నావ థీమ్‌తో రూపొందించిన నావిక దళ శకటం ప్రధానాకర్షణగా నిలిచింది.

డీఆర్‌డీఓ రూపొందించిన అత్యాధునిక హైపర్‌సోనిక్ గ్లైడ్ మిసైల్ ఎల్‌ఆర్‌ఏఎస్‌హెచ్‌ఎంను అంతా ఆసక్తిగా తిలకించారు.
సీఆర్పీఎఫ్, సశస్త్ర సీమాబల్ డేర్‌డెవిల్ మోటార్‌సైకిల్ రైడర్ బృందాల సంయుక్త విన్యాసాలు ఆకట్టుకున్నాయి.
ఇక ఆహూతులంతా ఆసక్తిగా ఎదురు చూసిన ఏరియల్ ఫ్లైపాస్ట్ విన్యాసాలు ఉర్రూతలూగించాయి. 29 విమానాలు ఇందులో పాల్గొన్నాయి. వాటిలో 16 యుద్ధ విమానాలు కాగా నాలుగు రవాణా విమానాలు, 9 హెలికాప్టర్లు.
రాఫెల్, మిగ్29, సెఖోయ్30 జాగ్వార్ యుద్ధ విమానాలు ఆపరేషన్ సిందూర్‌ను తలపించేలా స్పియర్‌హెడ్ ఆకృతిలో ఒళ్లు గగ్గుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించాయి.
కర్తవ్య పథ్‌లో కవాతు చేసిన 30 శకటాలు దేశ సాంస్కృతిక ఘనతకు, వైవిధ్యానికి అద్దం పట్టాయి. వీటిలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవి 17 కాగా, 19 కేంద్ర ప్రభుత్వ శాఖలు, త్రివిధ దళాలకు చెందినవి.

**రక్షణ పాటవానికి అద్దం: మోదీ**

గణతంత్ర వేడుకలు భారత రక్షణ పాటవానికి అద్దం పట్టాయని మోదీ పేర్కొన్నారు. మన సన్నద్ధతకు, సాంకేతిక సామర్థ్యానికి, పౌరుల భద్రత పట్ల తిరుగులేని చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచాయని ఎక్స్ పోస్టులో ఆయన హర్షం వెలిబుచ్చారు.
"ఈ వేడుకల్లో ఈయూ అధినేతలకు ఆతిథ్యమివ్వడం భారత్‌కు గొప్ప గౌరవం. నానాటికీ బలపడుతున్న భారత్, ఈయూ బంధానికి ఇది అద్దం పట్టింది"అన్నారు.

**ఎన్నెన్నో 'తొలి'ఘనతలు!**

ఈ గణతంత్ర వేడుకలు పలు 'తొలిసారి'ఘనతలకు వేదికగా నిలిచాయి...
కొత్తగా ఏర్పాటైన పదాతి దళ భైరవ్ లైట్ కమెండో బెటాలియన్, శక్తిబాణ్ రెజిమెంట్, సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థ వంటివెన్నో వీటిలో ఉన్నాయి.
శక్తిబాణ్‌ను డ్రోన్, కౌంటర్ డ్రోన్ రెజిమెంట్‌గా తీర్చిదిద్దారు.
రెండు మూపురాల బ్యాక్ట్రియన్ ఒంటెలు, జన్‌స్కార్ అశ్వాలు తొలిసారి పరేడ్‌లో పాలుపంచుకున్నాయి.
61వ అశ్వికదళ సభ్యులు కూడా తొలిసారి కవాతులో పాల్గొన్నారు.
లద్దాఖ్, డోగ్రా, అరుణాచల్, కుమాయూన్, ఘడ్వాల్, సిక్కిం స్కౌట్స్ సభ్యులతో కూడిన మిశ్రమ స్కౌట్స్ దళం కూడా సైనిక దుస్తుల్లో తొలిసారిగా అలరించింది.
డీఆర్‌డీవో రూపొందించిన నౌకా విధ్వంసక హైపర్‌సోనిక్ క్షిపణి ఎల్‌ఆర్‌ఏఎస్‌హెచ్‌ఎం కూడా తొలిసారి పరేడ్‌లో పాల్గొంది.
రీమౌంట్ వెటర్నరీ కార్ప్స్ తరఫున సైనిక శునకాలు, డేగలు కూడా ఈసారి పరేడ్‌లో భాగస్వాములు కావడం విశేషం.
సుదర్శన చక్ర ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో సాగిన కవాతుకు మహిళా సైనికాధికారి సారథ్యం వహించారు.

**ఈయూ సైనిక దళాలు**

ఈసారి గణతంత్ర కవాతులో యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనిక దళాలు కూడా పాల్గొనడం విశేషం. ఈయూ సైనిక పతాకతో పాటు ఆపరేషన్ అట్లాంటా, ఆస్పిడెస్ నేవీ ఆపరేషన్ల తాలూకు పతకాలతో అలరించాయి. యూరప్ బయట ఇలాంటి వేడుకల్లో ఈయూ దళాలు పాల్గొనడం ఇదే తొలిసారి!

**నారీ శక్తిని చాటిన సిమ్రన్**

సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాల ఈసారి గణతంత్ర పరేడ్‌లో నారీ శక్తికి ప్రతీకగా నిలిచారు. పూర్తిగా పురుషులతో కూడిన 147 మంది సభ్యుల సీఆర్పీఎఫ్ దళానికి ఆమె సారథ్యం వహించి చరిత్ర సృష్టించారు. 'దేశ్ కే హమ్ రక్షక్'గీతం నేపథ్యంలో విన్పిస్తుండగా ఆమె నాయకత్వంలో సీఆర్పీఎఫ్ దళం కవాతు సాగింది. గణతంత్ర వేడుకల్లో పూర్తిగా పురుషులతో కూడిన సైనిక దళానికి మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించడం ఇదే తొలిసారి. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాకు చెందిన 26 ఏళ్ల సిమ్రన్ గతేడాదే సీఆర్పీఎఫ్‌లో చేరారు. ఆ జిల్లా నుంచి ఆఫీసర్ హోదాలో అందులో చేరిన తొలి మహిళ కూడా ఆమే కావడం విశేషం. సిమ్రన్ స్వగ్రామం నౌషెరా నియంత్రణ రేఖకు కేవలం 11 కి.మీ. దూరంలోనే ఉంటుంది. ఆమె తాత కూడా సైన్యంలో పని చేశారు.

**ఆకట్టుకున్న మోదీ తలపాగా**

గణతంత్ర వేడుకల్లో ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణీయమైన తలపాగా అందరినీ ఆకట్టుకుంది. ఈసారి ఆయన బంగారు జరీతో నేసిన నెమలీక ముద్రలతో కూడిన ముదురు ఎరుపు రంగు, పసుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన తలపాగా ధరించారు. ముదురు నీలం, తెలుపు రంగుల కుర్తా పైజామా, తేల నీలం రంగు హాఫ్ జాకెట్ ధరించారు. పదేళ్లకు పైగా పంద్రాగస్టు, గణతంత్ర వేడుకల్లో మోదీ రంగుల తలపాగాలు ధరిస్తూ వస్తుండటం తెలిసిందే. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్ కూడా భారత సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. సాధారణ ప్యాంటు, సూటుకు బదులుగా ఆమె ముదురు ఎరుపు, బంగారు రంగులతో కూడిన పట్టు బంద్‌గలా ధరించారు.

**నదుల పేర్లు**

ఈసారి గణతంత్ర వేడుకల్లో ఆహూతుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లకు ఈసారి వీవీఐపీ, వీఐపీ వంటి పేర్లకు బదులుగా నదుల పేర్లు పెట్టడం విశేషం. బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్, చీనాబ్, గండక్, గంగా, ఘగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోసీ, కృష్ణ, మహానది, నర్మద, పెన్నా, పెరియార్, రావి, సోన్, సట్లెజ్, తీస్థా, వైగై, యమున పేర్లతో ఎన్‌క్లోజర్లను రూపొందించారు. జనవరి 29న రాష్ట్రపతి కార్యాలయంలో జరిగే బీటింగ్ రిట్రీట్ వేడుకకు కూడా ఆహూతుల ఎన్‌క్లోజర్లకు వినూత్నంగా వేణువు, డమరుకం, ఎక్‌తారా, మృదంగం, నగాడా, పఖావజ్, సంతూర్, సారంగి, సరోద్, షెహనాయ్, సితార్, తబలా, వీణ వంటి భారత సంప్రదాయ సంగీత వాయిద్యాల పేర్లు పెట్టనున్నారు.

## వందేమాతరం స్ఫూర్తి

ఈసారి వేడుకల్లో వందేమాతరం థీమ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఆ గేయంలోని తొలి చరణాలకు అద్దం పట్టే తేజేంద్రకుమార్ మిత్రా వంటి కళాకారుల పురాతన పెయింటింగుల నమూ నాలను ఆహూతుల ఎన్‌క్లోజర్లపై ప్రద ర్శించారు. జాతీయోద్యమంలో దేశమంతటా స్ఫూర్తి నింపిన ఈ గేయ రచనకు ఈ సంవత్సరమే 150 ఏళ్లు నిండటం తెలిసిందే. ఆ సందర్భంగా '150 ఏళ్ల వందేమాతరం'థీమ్‌కు గణతంత్ర వేడు కల్లో ప్రాధాన్యం దక్కింది. ఆహ్వానపత్రికల నుంచి పరేడ్ల దాకా అన్నింట్లోనూ వందేమాతరం లోగో దర్శనమిచ్చింది.

## సందడిగా 'ఎట్ హోం'

న్యూఢిల్లీ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం'కార్యక్రమం సోమవారం సందడిగా జరిగింది. గణతంత్ర వేడుకల్లో విశిష్ట అతిథులుగా పాల్గొన్న యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లెయన్ తదితరులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా విందు ఇచ్చారు. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ తదితరులతో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విందులో ఈశాన్య భారతానికి చెందిన రకరకాల వంటకాలు ఆహూతులను అలరించాయి. ఈశాన్య సంప్రదాయానికి అద్దం పట్టే పలు సాంస్కృతిక కళారూపాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. వాటిని అతిథులు ఎంతగానో ఆస్వాదించినట్టు రాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ముఖ్య అతిథులతో కలిసి ఈశాన్య కళాకారులతో ముర్ము, రాధాకృష్ణన్, మోదీ ఈ సందర్భంగా ఫొటోలకు పోజులిచ్చారు.

## భారత్, ఈయూ చారిత్రక వాణిజ్య డీల్

న్యూఢిల్లీ

ఐరోపా దేశాల ఉత్పత్తులను భారతీయ వినియోగదారులకు చవగ్గా అందించే లక్ష్యంతో యూరోపియన్ యూనియన్‌తో భారత్ చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలతో ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం భేటీ తర్వాత అధికారికంగా ఎఫ్‌టీఏ ఒప్పందాన్ని ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఒప్పందానికి సంబంధించి ఉన్నతాధికారుల స్థాయి చర్చలు సోమవారం ముగిశాయని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ప్రకటించారు. అయితే చర్చలు విజయవంతమయ్యాయని మంగళవారం అధికారికంగా భారత్‌ఈయూ సదస్సులో అగ్రనేతలు ప్రకటించనున్నారు. ఉర్సులా, యూరోపియన్ యూనియన్ వాణిజ్య, ఆర్థిక భద్రతా విభాగ కమిషనర్ మారోస్ సెకోవిక్‌లతో ప్రధాని మోదీ విస్తృతస్థాయి చర్చల తర్వాత ఒప్పంద వివరాలను బహిర్గతం చేయనున్నట్లు తెలుస్తోంది. ముడి వస్త్రాలు, తోలు, దుస్తులు, పాదరక్షలు, రత్నాలు, వజ్రాభరణాలు, కార్లు, వైన్ తయారీ పరిశ్రమల ఉత్పత్తులపై ఈయూ టారిఫ్‌లను పూర్తిగా తొలగించాలని భారత్ మొదట్నుంచీ డిమాండ్‌చేస్తోంది. ఈ మేరకు ఈయూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాణిజ్యం, రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, భూఅయస్కాంతాల వెలికితీత సంబంధ సంక్లిష్టమైన సాంకేతికతలు సహా పలు అంశాలపై ఒప్పందం కుదిరినట్లు సమాచారం. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈయూలోని 27 సభ్యదేశాలతో భారత్ మరింత విస్తృతమైన రక్షణ, భద్రత సహకారం ఉండేలా భద్రత, రక్షణ ఒప్పందం(ఎస్‌డీపీ) కుదుర్చుకోనున్నారు. ఎఫ్‌టీఏను ప్రకటించక ముందే రక్షణ ప్రణాళికా చట్రం, వ్యూహాత్మక ఎజెండాలను ఆవిష్కరించనున్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) ఒప్పందం కుదిరాక యూరోపియన్ యూనియన్‌లోని సెక్యూరిటీ యాక్షన్ ఫర్ యూరప్(సేఫ్) కార్యక్రమంలో భారతీయ సంస్థలు చేరతాయి. తద్వారా యూరప్ మార్కెట్లోకి భారతీయ కంపెనీలు అడుగుపెడతాయి. దీంతోపాటు పారిశ్రామిక రక్షణ సహకారం బలోపేతం లక్ష్యంగా సెక్యూరిటీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అగ్రిమెంట్(ఎస్ఓఐఏ)ను కుదుర్చుకోనున్నారు. భారతీయ కార్మికులను యూరప్‌లో అవకాశాలు పెంచేలా అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకోనున్నారు.

**లగ్జరీ కార్లపై టారిఫ్ తగ్గే చాన్స్..**

తమ విలాసవంత కార్లపై టారిఫ్‌ను భారత్ తగ్గించాలని ఈయూ దేశాలు కోరుతున్నాయి. దీంతో ఇరువైపులా డిమాండ్లు ఏమేరకు నెరవేరనున్నాయో మంగళవారంతో తేలిపోనుంది. మరోవైపు సేవారంగంలోనూ ఉదారవాద నిర్ణయాలను తీసుకోనున్నారు. అయితే యూరప్‌కు చెందిన లగ్జరీ కార్లపై దిగుమతి సుంకాన్ని భారీగా తగ్గించాలని భారత్ భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం లగ్జరీ కార్లపై 110 శాతం టారిఫ్ విధిస్తుండగా ఇకపై కేవలం 40 శాతం టారిఫ్ విధించనున్నట్లు తెలుస్తోంది. దీంతో భారత్‌లో లగ్జరీ కార్ల సెగ్మెంట్ విపరీతంగా విస్తరించనుంది. ప్రస్తుతం కార్ల మార్కెట్లో విలాసవంత కార్ల మార్కెట్ కేవలం ఒక శాతం ఉండటం గమనార్హం. ఈ సెగ్మెంట్ వృద్ధికి విపరీతమైన అవకాశాలు ఉన్నాయి. 15 వేల యూరోల(రూ.16 లక్షలు) కంటే ధర ఎక్కువుండే కార్లకే ఈ తగ్గింపు వర్తింపజేయాలని యోచిస్తున్నారు. దీంతో ఫోక్స్‌వ్యాగన్, మెర్సిడెజ్‌బెంజ్, బీఎండబ్ల్యూ కార్ల మార్కెట్ మరింత విస్తృతంకానుంది. భవిష్యత్తులో ఈ 40 శాతం టారిఫ్‌లను 10 శాతం స్థాయికి తగ్గిస్తారని తెలుస్తోంది.

**136.53 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం..**

ప్రస్తుతం ఈయూ మద్యం ఉత్పత్తులపై భారత్ 100125 శాతం టారిఫ్ విధిస్తోంది. ఈయూ ఆటోమొబైల్ విడిభాగాలపై భారత్ 35.5 శాతం, ప్లాస్టిక్‌లపై 10.4 శాతం, రసాయనాలు, ఫార్మాసూటికల్స్‌పై 9.9 శాతం టారిఫ్ విధిస్తోంది. ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చాక ఇన్నాళ్లు ఇరువైపులా వాణిజ్యం జరిగే వస్తూత్పత్తుల్లో 90 శాతం ఉత్పత్తులపై టారిఫ్‌ను భారీగా తగ్గించడమో లేదా పూర్తిగా తొలగించడమో చేయాలి. అయితే తమ బీఫ్, చక్కెర, బియ్యం మార్కెట్ల రక్షణకు ఈయూ ప్రాధాన్యతనిస్తోంది. భారత్ తమ పాడి ఉత్పత్తులు, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు భారత్ పాటుపడుతోంది. ప్రస్తుతం ఈయూ దేశాలతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం 202425 ఆర్థికసంవత్సరంలో 136.53 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇందులో భారత్ నుంచి 75.85 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమ తులు ఉండగా భారత్‌కు 60.68 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు ఉన్నాయి. 202425లో భారత్ 15.17 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులును సాధించింది. భారత ఎగుమతుల్లో ఈయూ దేశాలకు 17 శాతం వస్తూత్పత్తులు వెళ్తున్నాయి.

## రష్యాలో కార్మికుల కొరత..



తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్న రష్యా, ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు భారత్ వైపు చూస్తోంది. ఈ ఏడాది దాదాపు 40,000 మంది భారతీయ కార్మికులను నియమించుకోవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే సుమారు 70,000 నుంచి 80,000 మంది భారతీయులు గత ఏడాది చివరి నాటికి రష్యాలో పనిచేస్తున్నట్లు అంచనా. భారతదేశం నుంచి నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులను రష్యాకు పంపించే ప్రక్రియను సులభతరం చేసేందుకు గత డిసెంబర్‌లో ఇరు దేశాలు రెండు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాల ద్వారా కార్మికుల తరలింపు ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు, గతంలో జరిగిన మోసాల వంటివి పునరావృతం కాకుండా వారికి రక్షణ కల్పించనున్నారు. ఎఫ్.ఎకీఎ కథనం ప్రకారం, రష్యాలో దాదాపు 5 లక్షల మంది పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికులకు డిమాండ్ ఉంది. మొత్తం మీద 30 లక్షల మంది నిపుణుల కొరతను ఆ దేశం ఎదుర్కొంటోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల వ్యాఖ్యానించారు. భారతదేశంలోని యువత, నైపుణ్యం గల శ్రామిక శక్తి ఈ లోటును తీర్చగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల, రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో వీధులు శుభ్రం చేసే పనిలో ఓ భారతీయ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌తో సహా 17 మంది కార్మికులు ఉన్నట్లు రష్యన్ మీడియా 'ఫొంటాంకా' నివేదించడం గమనార్హం. మున్సిపల్, ఇతర సేవా రంగాల్లో కార్మికుల అవసరం పెరగడంతో రష్యా.. భారత్ వంటి మిత్రదేశాల నుంచి నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి చూపుతోంది.

## అమెరికాలో సన్ ఫార్మా, సిప్లా మందుల రీకాల్... కారణం ఇదే!



దేశీయ ఫార్మా దిగ్గజాలైన సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, సిప్లా అమెరికా మార్కెట్ నుంచి తమ ఉత్పత్తులను రీకాల్ చేస్తున్నాయి. తయారీలో తలెత్తిన లోపాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. వివరాల్లోకి వెళితే, సన్ ఫార్మాకు చెందిన అమెరికా విభాగం.. చుండ్రు, చర్మ సంబంధిత సమస్యలకు వాడే ఫ్లూసినోలోన్ ఎసిటోనైడ్ టాపికల్ సొల్యూషన్ మందుకు చెందిన 26,000కు పైగా బాటిళ్లను వెనక్కి పిలిపిస్తోంది. ఈ మందులో కల్మషాలు, నాణ్యతా ప్రమాణాలు నిర్దేశిత స్థాయికి మించి ఉన్నట్లు యూఎస్‌ఎఫ్‌డీఏ గుర్తించింది. దీనిని క్లాస్ ××× రీకాల్‌గా వర్గీకరించింది. ఇలాంటి రీకాల్స్ వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన హాని ఉండదని రెగ్యులేటరీ సంస్థ పేర్కొంది. దీంతో పాటు, మొటిమల చికిత్సలో వాడే క్లిండామైసిన్ ఫాస్ఫేట్ యూఎస్‌పీ మందును కూడా ఇదే కారణంతో సన్ ఫార్మా రీకాల్ చేస్తోంది.
మరోవైపు, సిప్లా కంపెనీకి చెందిన అమెరికా విభాగం లాన్‌రియోటైడ్ ఇంజెక్షన్‌కు చెందిన 15,000కు పైగా ప్రీ-ఫిల్డ్ సిరంజీలను రీకాల్ చేస్తోంది. ఈ మందులో చిన్న చిన్న రేణువులు కనిపించడమే ఇందుకు కారణం. దీనిని క్లాస్ ×× రీకాల్‌గా వర్గీకరించారు. ఇలాంటి మందుల వాడకం వల్ల తాత్కాలిక లేదా సరిదిద్దగలిగే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అయితే తీవ్రమైన ప్రమాదం ఉండకపోవచ్చని యూఎస్‌ఎఫ్‌డీఏ తెలిపింది.
ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా మార్కెట్ అయిన అమెరికాలో కార్యకలాపాలు నిర్వహించే కంపెనీలకు నాణ్యతా ప్రమాణాలు పాటించడం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో భారత కంపెనీలు తమ ఉత్పత్తులను రీకాల్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## భారత్ తో ట్రేడ్ డీల్ కు ఆ ముగ్గురూ అడ్డుపడ్డారు..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి.
అధ్యక్షుడు ట్రంప్ తో పాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అధ్యక్షుడి సలహాదారు పీటర్ నవారోపై టెక్సాస్ సెనేటర్ టెడ్ క్రూజ్ సంచలన ఆరోపణలు చేశారు. భారత్ తో ట్రేడ్ డీల్ కు ఈ ముగ్గురూ అడ్డుపడ్డారని క్రూజ్ విమర్శించారు. టారిఫ్ లు వద్దన్నందుకు ట్రంప్ తనపై అరిచాడని, ఓ అసభ్యకరమైన పదం ఉపయోగించాడని చెప్పారు. ఈ మేరకు గతేడాది జరిగిన డోనార్ మీటింగ్ లో ప్రైవేటు దాతలతో మాట్లాడుతూ క్రూజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన దాదాపు పది నిమిషాల ఈ ఆడియో రికార్డ్ ను ఆక్సియోస్ సంస్థ వెలుగులోకి తెచ్చింది.

**టెడ్ క్రూజ్ ఇంకా ఏంచెప్పారంటే..**

ట్రంప్ సొంతపార్టీ నేత టెడ్ క్రూజ్ దాతలతో మాట్లాడుతూ.. భారత్ తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని తాను శ్వేతసౌధంతో నిరంతరం పోరాటం చేస్తున్నానని చెప్పారు. అయితే ఈ ఒప్పందానికి పరిపాలన విభాగంలో ఎవరు అడ్డుపడుతున్నారని ఓ దాత ప్రశ్నించారు. దీనికి క్రూజ్ జవాబిస్తూ.. పీటర్ నవారో, జేడీ వాన్స్, కొన్ని సందర్భాల్లో స్వయంగా డొనాల్డ్ ట్రంపే ఈ ప్రక్రియను నిలిపి వేస్తున్నారని చెప్పారు. గతేడాది ఏప్రిల్ లో ఓ అర్ధరాత్రి పూట తాను ట్రంప్ కు ఫోన్ చేశానని, టారిఫ్ లు విధించే ఆలోచన మానుకోవాలని సూచించానని క్రూజ్ చెప్పారు. సుంకాల వల్ల ఆర్థిక వ్యవస్థపై చెడు ప్రభావం పడుతుందని, ఇప్పటికే మార్కెట్లో పలు వస్తుసేవల ధరలు 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగాయని చెప్పానన్నారు. ఈ ప్రభావంతో రాబోయే రోజుల్లో సెనేట్ పై, హౌస్ పై పట్టుకోల్పోతారని హెచ్చరించినట్లు తెలిపారు. అయితే, ట్రంప్ అప్పుడు తనపై అరిచారని క్రూజ్ వివరించారు. ఈ విషయంపై తన సిబ్బందితో జోక్ చేశానని, ట్రంప్ ఉపయోగించిన ఓ అసభ్య పదం మీలో ఎవరైనా ఉపయోగించి ఉంటే అప్పటికప్పుడు మిమ్మల్ని తొలగించేవాడినని చెప్పానన్నారు.

## సంపాదకీయం

# ఓటరు చైతన్యమే.. ప్రజాస్వామ్యానికి దన్ను


ప్రజాస్వామ్యం అనేది కేవలం ఒక రాజకీయ వ్యవస్థ మాత్రమే కాదు.. అది ప్రజల చైతన్యానికి ప్రతిరూపం. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిది మన ఓటు హక్కు. ఈ ఓటు హక్కు అనేది భారతదేశంలాంటి వైవిధ్యాలు గల దేశంలో సాధారణ హక్కు మాత్రమే కాదు, ప్రజల చేతుల్లో ఉన్న సార్వభౌమాధికారం. అంబేద్కర్ లాంటి మహనీయుడు ఓటు హక్కును ఒక ఆయుధంగా అభివర్ణించారు. 'ఓటు అనేది ప్రజల చేతికి ఒక కత్తి (ఆయుధం) వంటిది. దీని ద్వారా వారు తమ హక్కులను, స్వేచ్ఛను కాపాడుకోవడమే కాకుండా, సమాజంలో సామాజిక, ఆర్థిక మార్పులను కూడా తీసుకురాగలరు' అని ఆయన విశ్వసించారు. భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. ఇది రాజ్యాంగ నిర్మాతలు ప్రజలపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. చదువు, సంపద, కులం, మతం, లింగం వంటి భేదాలు లేకుండా ప్రతి పౌరుడికి ఒకే ఓటు విలువ ఉండటం భారత ప్రజాస్వామ్యానికి గొప్ప బలం. ఓటు ద్వారా ప్రజలు తమ పాలకులను మాత్రమే కాదు, దేశం, రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించే అధికారం కూడా తమ చేతుల్లోనే ఉంచుకుంటారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు, సమస్యలు ప్రభుత్వ విధానాల్లో ప్రతిబింబించాలంటే ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలి. 'నా ఓటు ఫలితాలను మారుస్తుందా?' అని తేలిగ్గా తీసుకోవద్దు. ఒక్క ఓటు తేడాతో ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి గారు అధికారాన్ని కోల్పోయిన సందర్భం చరిత్రలో ఉంది. 'నేనొక్కడినే ఓటేయకపోతే కొంపలు మునుగుతాయా?' అని అనుకోవద్దు. నిజంగానే కొంపలు మునుగుతాయి.. ఆ మాటకొస్తే దేశాలు, రాష్ట్రాలే మునుగుతాయి. ఒక డాక్టర్ తప్పు చేస్తే ఒక రోగి మాత్రమే చనిపోతాడు. కానీ ఒక రాజకీయ నాయకుడు తప్పు చేస్తే లక్షలాది మంది భవిష్యత్తుపై దాని ప్రభావం పడుతుంది. ప్రజలు ఓటు వేయడం వల్లే ప్రభుత్వం ప్రజలకు బాధ్యతగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయినప్పటికీ నేటి సమాజంలో చాలా మంది ఓటు వేయడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓటు అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాకుండా ఒక బాధ్యత అని ప్రతి ఒక్కరూ భావించాలి. ప్రజలు ఎన్నికల్లో పాల్గొనకపోతే ప్రజాస్వామ్యం బలహీనంగా మారే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో కొద్దిమంది మాత్రమే ఓటు వేయడం వల్ల వారి అభిప్రాయాలే ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. చరిత్రను పరిశీలిస్తే ఓటు హక్కు కోసం అనేక ఉద్యమాలు జరిగాయి. మహిళలు, అణగారిన వర్గాలు చాలా కాలం పాటు తమ హక్కుల కోసం పోరాటం చేశారు. ఓటు ద్వారా సామాజిక మార్పు సాధ్యమని ఈ ఉద్యమాలు స్పష్టంగా నిరూపించాయి. అయినా నేటి యువతలో ఓటు ప్రాధాన్యతపై సరైన అవగాహన లేకపోవడం బాధాకరం. పేదరికం, నిరుద్యోగం, విద్య, ఆరోగ్యం వంటి సమస్యల పరిష్కారానికి సరైన నాయకులను ఎన్నుకోవడం అత్యంత అవసరం. అయినా కొంతమంది 'ఓటు వేయడం వల్ల ఏమి మారుతుంది?' అనే భావనతో ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలు పెరుగుతుండటం ఓటు పవిత్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రజల సంకల్పం కాకుండా ప్రలోభాలే ఫలితాలను నిర్ణయిస్తే పాలనపై విశ్వాసం దెబ్బతింటుంది. కుల, మత రాజకీయాలు కూడా ఓటు సంస్కృతిని దెబ్బతీస్తున్నాయి. అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యం కంటే సామాజిక గుర్తింపులే ప్రాధాన్యం పొందడం సమాజాన్ని విభజన దిశగా నడిపిస్తోంది. దీని వల్ల ప్రజాస్వామ్య చర్చల స్థాయి తగ్గిపోతోంది. 1951-52లో జరిగిన తొలి సాధారణ ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి ఒక చారిత్రక ఘట్టం. అక్షరాస్యత తక్కువగా ఉన్నప్పటికీ సుమారు 45 శాతం ఓటింగ్ నమోదు కావడం రాజ్యాంగంపై ప్రజల విశ్వాసాన్ని చాటింది. 1977 ఎన్నికలు ఓటు శక్తిని దేశానికి మరోసారి గుర్తుచేశాయి. అత్యవసర పరిస్థితి అనంతరం ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని తమ అసంతృప్తిని బ్యాలెట్ ద్వారా వ్యక్తం చేశారు. 1990లలో ప్రాంతీయ పార్టీల ఉద్భవం, కూటమి రాజకీయాలు ఓటర్ల ఆసక్తిని మరింత పెంచాయి. ఇటీవలి 2014, 2019 ఎన్నికల్లో ఓటింగ్ శాతం చరిత్రాత్మక స్థాయికి చేరింది. మహిళలు, గ్రామీణ ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రజాస్వామ్యానికి సానుకూల సంకేతం. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయ చర్చల దిశను మార్చిన ప్రధాన సాధనం సోషల్ మీడియా. ఇది సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా తొలిసారి ఓటు వేయబోయే యువతకు ఇది రాజకీయ ప్రవేశ ద్వారంగా మారింది. అయితే తప్పుడు వార్తలు, అర్ధసత్యాలు, ఎడిట్ చేసిన వీడియోలు ఓటర్ల నిర్ణయాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. వైరల్ అయినదే నిజమన్న భావన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. అల్గారిథమ్ ప్రభావం వల్ల ఓటర్లు ఒకే అభిప్రాయ వలయంలో పరిమితమవుతున్నారు. డబ్బుతో నడిచే డిజిటల్ ప్రచారం, లక్ష్యిత ప్రకటనలు, బాట్ ఖాతాలు ఎన్నికల సమానత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. సోషల్ మీడియా శత్రువూ కాదు, రక్షకుడూ కాదు; అది ఒక సాధనం మాత్రమే. దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే అసలు ప్రశ్న. ఎన్నికల కమిషన్‌తో పాటు సోషల్ మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలి. అంతకంటే ముఖ్యంగా ప్రజల్లో మీడియా లిటరసీ పెంపొందించాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయాన్ని నమ్మకుండా ఆలోచించి, పరిశీలించి నిర్ణయం తీసుకునే సంస్కృతి పెరిగినప్పుడే ఈ డిజిటల్ యుగంలో ప్రజాస్వామ్యం బలంగా నిలుస్తుంది.

# బహుముఖ ప్రజ్ఞాశాలి పోతుకూచి

పోతుకూచి సాంబశివరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. పద్య వచన గేయ కవిగా, రచయితగా, న్యాయవాదిగా, అనువాదకునిగా, పత్రికా రచయితగా, నటునిగా, నాటక కర్తగా, లఘు కవితా ప్రక్రియ ప్రారంభకునిగా, సాహితీ సంస్థల వ్యవస్థాపక బాధ్యునిగా, మహా సభల నిర్వాహకునిగా, జర్నలిస్టుగా, సంపాదకునిగా...ఇలా చెప్పుకుంటూ పోతే...అసమాన ప్రతిభ కనబరిచి, బహుముఖీన, అగణిత సేవలు అందించిన ప్రతిభాశాలి ఆయన. తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు గ్రామంలో పోతుకూచి నరసింహమూర్తి, సూరమ్మ దంపతులకు 1927, జనవరి 27వ తేదీన జన్మించాడు. ప్రాథమిక విద్య కోటిపల్లి, ఆలమూరు గ్రామాలలో, ఉన్నత పాఠశాల విద్య రామచంద్రపురంలో, కళాశాల విద్య కాకినాడలో చదివాడు. హైదరాబాదులో ఎల్.ఎల్.బి. చదివి న్యాయవాదిగా వృత్తిని కొనసాగించాడు. కథా రచయితగా దాదాపు 350 కథలు వ్రాశాడు. అయన కథలు ఆంధ్రపత్రిక, కిన్నెర, యువ, ఆంధ్రప్రభ, పుస్తకం, కృష్ణాపత్రిక, ఆంధ్రప్రదేశ్, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, అనామిక, చిత్రగుప్త, భారతి, తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికలలో ప్రచురింప బడ్డాయి. ఈ కథలు సాంబశివరావు కథలు (6 సంపుటాలు), శేఖరం కథలు, ఏడుప్రశ్నలు, కొత్త విలువల బ్రతుకు, పోతుకూచి కథలు, ఎదురు ప్రశ్నలు, నవకథంబం, మందారాలు, విక్రమ, వేదప్రియ, హైదరాబాదులో, బ్రతుకుల పతనం పేర్లతో పుస్తక రూపంలో వెలువడ్డాయి. అయన కథలు హిందీ, కన్నడ, తమిళ, రష్యన్, జర్మనీ, ఆంగ్ల భాషల్లోకి అనువదించబడ్డాయి. ఇతని కథలపై చలం ప్రభావం కనిపిస్తుంది. అయన ఐదు నవలలు వ్రాశాడు. "అన్వేషణ" నవలకు మద్రాసు తెలుగు భాషాసమితి నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. ఆధునికాంధ్రుల సాంఘిక జీవితాన్ని ఈ నవల చక్కగా చిత్రించింది. దీనిని మద్రాసు విశ్వవిద్యాలయం బి.ఎ.లో "ఉపవాచకం"గా నిర్ణయించింది. "ఉదయ కిరణాలు" నవల 1956లో ఆంధ్ర సచిత్రవార పత్రిక నడిపిన పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ నవల 1967లో రష్యన్ భాషలోకి అనువదించ బడింది. ఏడురోజుల మజిలీ శృంగార రసప్రధానమైన నవల. చలమయ్య షష్టిపూర్తి, నీరజ ఆయన ఇతర నవలలు. పోతుకూచి సాంబశివరావు స్వయంగా నటుడు. నాటకకర్త కూడా. అయన వ్రాసిన హంతకులు నాటకం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీచే ఉత్తమ నాటకంగా ఎంపిక కాబడింది. "పల్లె కదిలింది" నాటకం ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శించ బడింది. దొంగ-దొర, ఇదీ తంతు, ఏడు సున్నాలు, ప్రతి ధ్వనులు, పెళ్ళి పిలుపు, రెండు నాలికలు, అద్దెకొంపలో ఒక నెల, ఒన్ టూ త్రీ ఫోర్, ఏం ప్రేమలో ఏం గొడవలో, అంతరించే అంతరాలు, దీన్ దయాళ్‌గారి దేవుడిలో, సరిహద్దుల్లో, చుట్టాల రభస, అంత్య క్రియలు మొదలైనవి ఇతడు వ్రాసిన ప్రసిద్ధమైన నాటకాలు/నాటికలలో కొన్ని. ప్రతిధ్వనులు అనే నాటికల సంపుటి ప్రచురించాడు. పద్యకవిగా, వచనకవిగా, గేయకవిగా ప్రసిద్ధుడైనాడు. మొదటి పద్య రచన కాలేజీ పోటీలలో బహుమతి గెలుచుకొంది. రాసి-సిరా, అనురాగం - అను - రాగం, సాంబశివానందలహరి, పోతుకూచీయం, శిఖరాలు, అగ్నినాదాలు, చైతన్య కిరణాలు మొదలైన కవితా సంపుటాలు పదికి పైగా వెలువరించాడు. అనేక కవితా సంకలనాల్లో, కవి సమ్మేళనాల్లో ఆయన పాల్గొన్నాడు. అనేక పత్రికల్లో కవితలు వెలువడ్డాయి. ఇతర భాషా సాహిత్య కవితలను తెలుగులోనికి అనువాదం చేశాడు. చుక్కలు అన్న నూతన "లఘు కవితా ప్రక్రియ"ను ప్రారంభించిన గొప్పతనం ఆయనదే. అనువాదకుడిగా గొప్ప కృషి చేశాడు. ఆలిండియా రేడియో నిర్వహించిన "జాతీయ కవి సమ్మేళనం", గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన కవి సమ్మేళనాలలోని ఆంగ్ల కవితలు, కొంకణి, కన్నడ, ఒరియా, మరాఠి, హిందీ, నేపాలీ కవితలు అనేకం తెలుగులోకి అనువదించాడు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన "ఆలిండియా అనువాదకుల వర్క్‌షాప్"లో ప్రముఖ పాత్ర వహించాడు. దక్షిణ భారత భాషలకు సంబంధించి సాహిత్య అకాడమీ నిర్వహించిన అనువాదకుల వర్క్‌షాప్‌లలో కూడా పోతుకూచి ప్రముఖంగా నిలిచాడు. అమెరికా రీజనల్ ఆఫీస్ (మద్రాస్) వారికి సంబంధించిన 'వాట్ డూ యు నో అబౌట్ లేబర్' అన్న పుస్తకాన్ని తెలుగులోనికి అనువాదం చేశాడు. నేషనల్ బుక్‌ట్రస్ట్ వారి ఆంగ్ల బాల సాహిత్యాన్ని ఎక్కువ శాతం మేరకు తెలుగు లోకి అనువాదం చేసిన ఘనత ఆయనదే. కన్నడ రచయిత సి.కె.నాగరాజారావు రాసిన ప్రముఖ కన్నడ నాటకం 'సంకోలు బసవన్న' కూడా ఆంధ్రీకరించాడు. హిందీ భాషలో భీమసేన్ నిర్మల్ వ్రాసిన 'హిందీకి- అచ్చీ- కహా నియా'కు అనువాదం వెలువరించాడు. వచన కవితా రీతులను అనువాదాలతో సహా 1977లో ప్రచురించాడు. సాంబశివరావు కార్యక్రమాల నిర్వాహకుని గా పేరు తెచ్చుకున్నాడు. హైదరాబాదు సాహిత్య సంస్థ నిర్మాణ దక్షుడిగానే కాకుండా "నవ్య సాహితీ సమితి, ఆంధ్ర విశ్వసాహితి" అనే సంస్థలను నెల కొల్పాడు. "అఖిల భారత తెలుగు రచయితల మహాసభ" లను తొలిసారిగా 1960లో హైదరాబాదులో, 1963లో రాజమండ్రిలోన, 1967లో తిరుపతి, 1969,1971లలో తిరిగి హైదరాబాదులోను ఘనంగా నిర్వహించాడు. 1965లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలు హైదరాబాదులో నిర్వహించాడు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు కార్యదర్శిగా పనిచేసి ఆసంస్థ వజ్రోత్సవాలు విజయ వంతంగా నడిపాడు. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులలో ఒకడిగా ఉన్నాడు. ఇతనికి ఇతర సాహిత్య సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీ సభ్యుడిగా, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం సలహా సంఘ సభ్యుడిగా, ఆంధ్ర మహిళాసభ సాహిత్య నిర్వాహక మండలిలో సభ్యునిగా, కేంద్ర సాహిత్య అకాడెమీ సలహా సంఘ సభ్యుడిగా సేవలను అందించాడు. 1959లో బరోడాలో జరిగిన అఖిల భారత రచయితల మహాసభలలో పాల్గొన్నాడు. 1961లో మద్రాసులో యునెస్కో ఏర్పాటు చేసిన సదస్సులో దక్షిణ భారతదేశం తరఫున పాల్గొన్నాడు. మారిషస్ దీవులలోని ఆంధ్రుల గురించి తెలుసు కోవడానికి, వారితో సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పడానికి మారిషస్ సందర్శించాడు. సంపాదకునిగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర వేశాడు. విశ్వరచన, విశ్వ, యూనిలిట్ మొదలైన పత్రికలను నడిపాడు. యువ కవులను, రచయితలను ప్రోత్సహించాడు. దక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రికలో 'ది తెలుగు వరల్డ్' అనే శీర్షికతో తెలుగు సంస్కృతి సాహిత్యాలపై అనేక వ్యాసాలు వ్రాశాడు. ఆంధ్రప్రతిక (దినపత్రిక) లో 'న్యాయం', 'చట్టం' గురించి సామాన్యులకు అర్థమయ్యేలా అందరికీ న్యాయం అనే శీర్షికతో పలు వ్యాసాలు వ్రాశాడు. ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ ప్రచురించే నాట్యకళ మాస పత్రికకు సహాయ సంపాదకత్వం వహించాడు. ఏ.పి.టైమ్స్ ఆంగ్ల పత్రికలో దాదాపు సంవత్సరం పైగా వివిధ సాహిత్య విషయాలు, సభలు, సమావేశాలు గురించి రిపోర్టింగ్ చేశాడు. 'సిటిజన్స్ ఈవినింగ్' అనే పత్రిక ద్వారా వారం వారం జ్యోతిష ఫలితాలు ఆంగ్లంలో ప్రచురించాడు.

# సాటిలేని మేటి.. విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి

ఆయన కంఠస్వరం సుమధురమైంది. స్వచ్ఛమైన ఉచ్ఛారణ ఆయన కంఠంలో ఒదిగి పోయింది. వేదవాఙ్మయ ఔన్నత్యాన్ని సుస్వరంగా, లయబద్ధంగా విశ్వానికి వ్యక్తీకరించిన సనాతన సాంప్రదాయ ప్రతీక ఆయన. నిత్య ప్రాతః స్మరణం చేసుకోవాల్సిన మహానుభావుడు, మహా పురుషుడు."వేదం వింటే విధాత సమక్షంలో వినాలి, లేదంటే బ్రహ్మశ్రీ జగన్నాధ ఘనపాఠి నోటవినాలి" అంటూ శ్రీశ్రీశ్రీ దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధిపతులయిన శ్రీ మదభినవ విద్యాతీర్థస్వామి జగద్గురువులచే ప్రశంసింప బడిన కారణ జన్ములు. ఆయనే విద్యా వాచస్పతి, ఘనాలంకార, ఘనపాటి చక్రవర్తి, వేద సమ్రాట్, విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి.ప్రముఖ వేద పండితులైన విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి... బ్రహ్మశ్రీ సుబ్బావధానులు, శ్రీమతి సుబ్బమ్మ దంపతులకు విశాఖపట్నం జిల్లా, చోడవరం తాలూకా, చిన్ననందిపల్లి అగ్రహారంలో సౌమ్య పుష్య బహుళ విదియనాడు (జనవరి 27, 1910) జన్మించారు. రాజోలు సమీపంలోని నరేంద్ర పురంలో బ్రహ్మశ్రీ రాణి సుబ్బావధానులు దగ్గర కూడా కొంతకాలం శిష్యరికం చేసారు. ఆయన వేదం చెబుతుంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించేదని పలువురి ప్రశంసలు అందుకున్నారు. పిన్నవయస్సులోనే ఆదిభట్ల నారాయణదాసు దగ్గర లయబద్ధంగా వేదస్వస్తి చెప్పి, ప్రశంసలు అందుకున్నారు. ఎక్కడైనా వేదసభలు జరుగుతుంటే అందరితో కలసి జగన్నాథ ఘనపాఠి వేదస్వస్తి చెప్పేవారు. అక్కడున్న వేద పండితులంతా కనీసం ఒక ఘనా పనసైనా చెప్పాలని పట్టుబట్టేవారు. భారత తొలి రాష్ట్రపతి డా.బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా 1961 జూలై 2న "విద్యా వాచస్పతి" పురస్కారం అందుకున్న ఘనపాఠి. అలా ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆనాటి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డా జాకీర్ హుస్సేన్, వి. వి. గిరి, డా. శంకర్ దయాళ్ శర్మ, నాటి ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ, పి. వి. నరసింహారావు అలాగే డా. కె.ఎల్.రావు వంటి ప్రముఖుల చేత సత్కారాలు పొందారు. శృంగేరీ జగద్గురువులు శ్రీ మదభినవ విద్యా తీర్థులవారు "ఘనాలంకార" బిరుదుతో సత్కరించగా, శ్రీ శ్రీ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి చేతుల మీదుగా "ఘనపాఠి చక్రవర్తి" బిరుదుతో సన్మానం అందుకున్నారు. విజయ నగరం వేద పరిషత్ "వేద సమ్రాట్" బిరుదుతో సత్కారం చేయగా, సువర్ణ పతకంతో శృంగేరి శారదా పీఠాధిపతులు, సువర్ణ హారంతో కంచి కామకోటి పీఠాధిపతి సన్మానించారు. సువర్ణ గండ పెండేరంతో విశాఖ వేద శాస్త్ర పరిషత్ సత్కరించింది. రాజమహేంద్రవర పుర వాసులు 1964లో జగన్నాథ ఘనపాఠికి సువర్ణ ఘంటా కంకణ సన్మానం చేసారు. 1970లో పద్మ భూషణ్ ఉప్పులూరి గణపతి శాస్త్రి ఆధ్వర్యాన ఘనపాఠి షష్టిపూర్తి మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. 1975లో రాష్ట్ర ప్రభుత్వం నుండి "పండిత పురస్కారం" అందుకున్నారు. శ్రీ రామభక్త గానసభ ఆధ్వర్యాన బ్రహ్మశ్రీ విశ్వనాధ జగన్నాధ ఘనపాఠికి "కనకాభిషేకం" చేయగా, 1991 జనవరి 2న రాజమండ్రి పురపాలక సంఘం పౌర సన్మానం చేసి, గౌరవించింది.



అదేరోజు ఘనపాఠికి "సహస్ర చంద్ర దర్శన మహోత్సవం" పురవాసులు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ లో నిర్వహించిన ప్రపంచ తొలి తెలుగు మహాసభలు జగన్నాధ ఘనపాఠి "వేదస్వస్తి" తోనే శుభారంభ మయ్యాయి. ఇందిరాగాంధి ప్రధానిగా వుండగా, పెద జీయర్ స్వామి డిల్లీలో నిర్వహించిన అఖిల వేదశాఖా సమ్మేళనంలో ఘనపాఠి పాల్గొని, లయబద్ధమైన వేద స్వస్తితో అందరి ప్రశంసలు పొందారు. రాజమండ్రి వేదశాస్త్ర పరిషత్ తో పాటు, విజయవాడ, టి టి డి వేద శాస్త్ర పరిషత్ లు నిర్వహించే పరీక్షలకు "పరీక్షాధికారి"గా వ్యవహరించారు . కాశీలో శ్రీ రాజేశ్వర శాస్త్రి ద్రవిడ అధ్యక్షతన జరిగిన వేద సభలలో పాల్గొని, వేద వాఙ్మయంలో ఓలలాడించారు. ఇక 1958 ఫిబ్రవరిలో శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఘన స్వస్తి ప్రారంభించి, 40 రోజుల పాటు నిర్వహించడమే కాక, పండితులందరికీ సువర్ణ కుండలాలతో సత్కారం చేయించిన ఘనత ఘనపాఠి వారిదే. బ్రహ్మశ్రీలు గుళ్ళపల్లి వెంకట నారాయణ ఘనపాఠి, చిట్టి సుబ్రహ్మణ్య ఘనపాఠి , శ్రీపాద శ్రీరామ నృసింహ ఘనపాఠి , ఈమని రామకృష్ణ ఘనపాఠి వంటి ఉద్దండులతో ఈ ఘన స్వస్తిలో జగన్నాధ ఘనపాఠి పాలుపంచు కున్నారు. శృంగేరీ జగద్గురువులు శ్రీ మదభినవ విద్యా తీర్థుల వారితో కలసి "కాశ్మీర్ యాత్ర" సాగించారు. యావద్భారతదేశంలో పర్యటించి, వేద ప్రచారం గావించిన ఘనపాఠి వారికి ఎందరో శిష్యులున్నారు. బ్రహ్మశ్రీలు గోలి కొండావధానులు, అయ్యల సోమయాజుల సుబ్బావధానులు, యడవల్లి రమణావధానులు వంటి వారంతా శిష్యగణంలో వారే. టిటిడి "వేద పారాయణ స్కీం పర్యవేక్షకుని"గా కొంతకాలం సేవలందించిన ఘనపాఠి 1994 ఆగస్టు27 శ్రావణ బహుళ షష్టి శనివారం తెల్లవారు ఝామున మహాభి నిష్క్రమణం (మరణం) చేసారు. 2010, జనవరి 2వ తేదిన ఘనాలంకార బ్రహ్మశ్రీ విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి "శత జయంతి సభ" రాజమహేంద్రవరం టిటిడి కల్యాణ మంటపంలో నిర్వహించారు. ఆయన పేరిట వేద శాస్త్ర పరిషత్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రతియేటా కృష్ణాష్టమికి వేదసభ నిర్వహించి, పండిత సత్కారం చేస్తున్నారు.

# ద్రాక్ష పండ్లతో గుండె పోటుకు చెక్..!



ద్రాక్ష పండ్లు అంటే ఎవరికి ఇష్టం ఉండదు. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా, ద్రాక్ష పండ్లను తింటుంటారు. వీటిని తినడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇవి గుండె పోటు, స్ట్రోక్ వంటి ప్రమాదం నుంచి రక్షిస్తుందంట. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వలన ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగు పరిచి, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జావోపింగ్ లి అన్నారు. వారు ద్రాక్ష పండ్లను ప్రతి రోజూ తినే వారిపై అధ్యయనం చేయగా, అందులో ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయంట. ముఖ్యంగా ద్రాక్ష పండ్లు తినే వారి ఆరోగ్యం క్రమంగా చాలా మెరుగు పడిందంట. ముఖ్యంగా గుండె సంబంధ సమస్యల ప్రమాదం చాలా వరకు తగ్గిందని వారు తెలియజేశారు. ద్రాక్ష పండ్లలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండటం వలన ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె ఆరోగ్యానికి కారణం అవుతున్నాయని వారు తెలియజేయడం జరిగింది. పరిశోధకులు 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మధ్య ఉన్న కొందరిని సర్వే చేయగా అందులో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయంట. ముఖ్యంగా ప్రతి రోజూ క్రమం తప్పకుండా 40 ద్రాక్షలు తినే వారిలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడమే కాకుండా, గట్ బ్యాక్టీరియా కూడా మెరుగు పడిందని వారు తెలిపారు. ముఖ్యంగా వీరిలో ఒఆఒ కొలెస్ట్రాల్ స్థాయిలు దాదాపు ఎనిమిది శాతం వరకు తగ్గిందని, అలాగే శరీరంలోని హానికరమైన కొవ్వులకు ఇదనంగా పనిచేసే పిత్త ఆమ్లాల స్థాయిలు కూడా 40 శాతానికి పైగా తగ్గినట్లు వారు పేర్కొన్నారు. దీని వలన ప్రతి రోజూ ద్రాక్ష పండ్లు తినడం వలన ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని వారు సూచిస్తున్నారు. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించమే కాకుండా ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాకు ఇవి దోహద పడుతున్నాయంట. ప్రతి రోజూ ద్రాక్ష పండ్లు తినడం వలన ఇవి గట్ బ్యాక్టీరియాను మెరుగు పరిచి, జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా ఇవి మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలను కూడా తగ్గించడంలో కీలకంగా పని చేస్తాయంట. అందుకే పరిశోధకులు ద్రాక్ష పండ్లను సూపర్ ఫుడ్ అని అన్నారు. ఎందుకంటే, ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# కిడ్నీలో రాళ్లు.. ఈ టిప్స్‌తో చెక్ !



కిడ్నీలోని రాళ్లు.. పెద్ద సమస్య కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్యను మొదట్లోనే పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన కిడ్నీల్లో రాళ్లను కరిగించే లేదా బయటికి పంపించే సులభ మార్గాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కిడ్నీలలో రాళ్లు అనేది సాధారణంగా మారిపోయింంది. మారుతన్న జీవనశైలి, తీసుకునే ఆహారం, తదితర కారణాలతో చాలా మంది కిడ్నీలో రాళ్ల సమస్యను ఎదుర్కొంటున్నారు. రాళ్లు పెద్దవిగా ఉంటే కిడ్నీ ప్రాంతంలో తీవ్రమైన నొప్పి వస్తుంది. అందుకే కిడ్నీలోని రాళ్లు.. పెద్ద సమస్య కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్యను మొదట్లోనే పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన కిడ్నీల్లో రాళ్లను కరిగించే లేదా బయటికి పంపించే సులభమైన మార్గాలు ఉన్నాయి. మనం తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్యను తగ్గించవచ్చని వైద్యారోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

1. రోజూ సరిపడా నీరు తాగండి: నీటితో నీరు తాగడం వల్ల మూత్రం సాఫీగా వస్తుంది. మూత్రంలో ఖనిజాల సాంద్రత తగ్గుతుంది. డాక్టర్ సూచన ప్రకారం రోజుకు కనీసం 2.5 లీటర్ల వరకు నీరు తాగడం మంచిది. నీరు తాగడం ద్వారా చిన్న క్రిస్టల్స్(రాళ్లు) పెద్దవికాక ముందే బయటకు పోతాయి, అందువల్ల రాళ్ల సమస్య కూడా తగ్గుతుంది. 2. ఉప్పు తక్కువగా తీసుకోండి: ఎక్కువ సోడియం (ఉప్పు) ఉండే ఆహారం తీసుకుంటే కిడ్నీలు మీ శరీరంలో ఉన్న కాల్షియం ఎక్కువగా మూత్రంలో రిలీజ్ చేస్తాయి. ఈ కాల్షియం కిడ్నీ స్టోన్స్ ఏర్పాటు చేసుకోవడానికి కారణం కావచ్చు. అందుకే ఉప్పు ఒక్క చెంచా (సుమారు 5 గ్రాముల) కంటే ఎక్కువ తీసుకోవద్దు. పరిశోధనలు కూడా ఉప్పు తగ్గించడం వల్ల రాళ్ల సమస్య తగ్గిందని చెబుతున్నాయి.

3. సిట్రేట్లు ఉన్న పండ్లు ఎక్కువగా తినండి: నిమ్మకాయ, ఆరెంజ్, మోసంబి వంటి సిట్రేట్ పండ్లు కిడ్నీ స్టోన్స్ ఏర్పడకుండా నిరోధిస్తాయి. సిట్రేట్ కల్పించే ఆహారం కాల్షియాన్ని క్రిస్టల్ రూపంలో ఉండకుండా, మూత్రంలో కదలికగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉదాహరణకి, నిమ్మరసం నీటిలో కలిపి ఉదయం మధ్యలో తాగటం చాలా మంచిది. కేవలం ఇవే కాకుండా.. ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారాలు (టమాట, పాలకుర, బీట్ రూట్ వంటి) ని పరిమితం చేయండి. ఎక్కువ రెడ్ మీట్ లేదా అధిక ప్రోటీన్ ఆహారం తగ్గించండి (యూరిక్ యాసిడ్ తగ్గిస్తుంది). నీటితో పాటు నిమ్మకాయ కలిపిన నీటిని రోజులో ఎక్కువసార్లు తీసుకోండి.

# యూరిక్ యాసిడ్ తగ్గించే బెస్ట్ ఫ్రూట్స్



ఈ మధ్య కాలంలో చాలా మంది అధిక యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. దీనిని హైప్ యూరిసెమియా అని కూడా అంటారు. దీని వలన కీళ్లు, మూత్రపిండ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. కొన్ని సార్లు ఇది చాలా ప్రమాదకరం కూడా కావచ్చు. అందుకే అధిక యూరిక్ యాసిడ్ సమస్య తగ్గిపోవాలి అంటే తప్పకుండా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంట. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లు తినడం వలన యూరిక్ యాసిడ్ అనేది కంట్రోల్ అవుతుందంట. సిట్రస్ ఫ్రూట్స్ : సిట్రస్ ఫ్రూట్స్ అంటే, నిమ్మకాయ, నారింజ వంటి పండ్లు. వీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అంతే కాకుండా ఇవి ఆరోగ్యానికి చాలా విధాలుగా మేలు చేస్తాయి. ముఖ్యంగా అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి రోజూ మీ డైట్‌లో వీటిని చేర్చుకోవడం వలన ఇవి మూత్ర పిండాల పనితీరును మెరుగు పరిచి, మూత్రం ద్వారా యూరిక్ యాసిడ్ విసర్జనను పెంచుతుంది. అలాగే శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా మీ డైట్‌లో నిమ్మకాయను చేర్చుకోవాలంట.

**బెర్రీస్ :** బెర్రీస్‌లలో విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి, పాలీఫెనాల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా ప్రతి రోజరూ వీటిని తినడం వలన ఇది శరీరానికి తక్షణ శక్తిని అందించి రోగిరోధక శక్తిని పెంచుతాయి. అయితే అంతే కాకుండా ఇవి యూరిక్ యాసిడ్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయంట. బెర్రీలలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వలన ఇవి మూత్రపిండాల ద్వారా విషాన్ని బయటకు పంపి, శరీరానికి మేలు చేస్తాయి. అరటి పండ్లు : అరటి ఆరోగ్యానికి చేసే మేలు గురించి ఎంత చెప్పినా తక్కువే. వీటిలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అందువలన రోజుకు ఒక అరటి పండు తినడం వలన ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలను చాలా త్వరగా తగ్గిస్తుందంట. అంతేకాకుండా వాపులు, కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.


**పైనాపిల్ :** పైనాపిల్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉండటమే కాకుండా, సహజ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అందువలన దీనిని తీసుకోవడం వలన ఇది కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగించి, మూత్రపిండాల ఆరోగ్యానికి దోహద పడుతుంది.

# ఎండు చేపలు ఇష్టంగా తింటున్నారా? ఈ నిజాలు తెలిస్తే షాక్ అవుతారు!



నాన్ వెజ్‌ప్రియులు చాలా మందికి చేపలంటే మరింత ఇష్టం..చేపలలో పచ్చివి, ఎండు చేపలు రెండు రకాలు తినేవారు కూడా చాలా మంది ఉంటారు. పచ్చి చేపలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో, ఎండు చేపలు కూడా ప్రయోజనకరం అంటున్నారు పోషకాహార నిపుణులు. వీటిలో అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. అయినప్పటికీ కొందరు మాత్రం వీటిని పొరపాటున కూడా తినకూడదని చెబుతున్నారు. చేపలను బాగా ఎండిబెట్టి అమ్ముతారు.. వీటిని ఎండు చేపలు అంటారు. వీటిని సాధారణంగా ఉప్పు కలిపి ఎండలో బాగా ఎండబెట్టి తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన చేపలు మార్కెట్లో కూడా అమ్ముతారు. ఇక వీటితో రకరకాల వంటకాలు తయారు చేసుకుంటారు ఫిష్ ప్రియులు. ఇలా చేపలను ఎండ బెట్టడం వల్ల వాటిల్లో ఉండే నీరు పోతుంది. కానీ, పోషకాలు మాత్రం అలాగే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎండు చేపలు తింటే బ్రెయిన్ హెల్త్, కంటి చూపు, ఎముకల ఆరోగ్యం బాగుంటుంది. అయితే వీటిని అతిగా తినడం ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు. గుండె జబ్బులు ఉన్నావారు జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడేవారు, చర్మ సమస్యలు, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ఎండు చేప తినకూడదని నిపుణులు చెబుతున్నారు..

# అవిసె గింజలతో లాభాలెన్నో..?



అవిసె గింజలు.. కేవలం ఆహారపు పదార్థమే కాక, ఆరోగ్యానికి విస్తృత ప్రయోజనాలను అందిస్తాయని ఆరోగ్య నిపుణులు కూడా పేర్కొంటున్నారు. అందుకే మనం తీసుకునే ఆహారంలో అవిసె గింజలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచిస్తున్నారు. అవిసె గింజలు చిన్న గోధుమరంగు గింజల్లా ఉంటాయి.. కానీ వాటిలో పోషకాలు చాలా గొప్పగా ఉంటాయి. అవిసె గింజలు ఆహారంగా తీసుకోవడం వల్ల మన శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. శరీరానికి అనేక విటమిన్లు, ప్రోటీన్లు అందించడంతోపాటు శక్తిని అందిస్తాయి. అంతేగాక, అనేక వ్యాధుల నుంచి కాపాడుతుంది. అవిసె గింజలు.. కేవలం ఆహారపు పదార్థమే కాక, ఆరోగ్యానికి విస్తృత ప్రయోజనాలను అందిస్తాయని ఆరోగ్య నిపుణులు కూడా పేర్కొంటున్నారు. అందుకే మనం తీసుకునే ఆహారంలో అవిసె గింజలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచిస్తున్నారు. గుండెకు మేలు.. అవిసె గింజలలో ఉన్న ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు (ఒఒం) హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి రక్తనాళాల్లోని కొవ్వును తగ్గించి, రక్తప్రవాహాన్ని సులభతరం చేస్తాయి. దీంతో గుండె సంబంధ వ్యాధులు తగ్గిపోతాయి.రక్తనాళాల్లో లిపిడ్ స్థాయిల సమతుల్యం.. హృదయపోటు, అథెరోస్క్లెరోసిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.. అవిసె గింజలు సెల్‌ఫైబర్ (పరిమితి, అణు ఫైబర్)లో ధనంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. అంతేగాక, కడుపు నొప్పి, కబ్జ్ సమస్యలను తగ్గిస్తాయి. ఆహారంలోని పాడైన ఫ్యాట్లు, చక్కెరలను శరీరంలో సమీకరించి నిల్వ చేసుకోవడాన్ని తగ్గిస్తాయి. మధుమేహం నియంత్రణ.. అవిసె గింజలలో ఘన ఫైబర్, లిగ్నాన్లు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ పెరుగుదలని తగ్గిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు ఉపయోగకరంగా ఉంటాయి. కేన్సర్ నివారణ.. అవిసె గింజలలో ఉండే లిగ్నాన్లు అనేవి ఫైటోఎస్ట్రోజెన్స్‌గా పనిచేస్తాయి. ఇవి కొన్ని కేన్సర్ రకాల (మొదటి స్థానంలో ప్రోస్టేట్, స్తన కేన్సర్) యొక్క వృద్ధి అవకాశాలను తగ్గిస్తాయి.బరువు నియంత్రణ.. అవిసె గింజలు ఆకలిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల పొట్ట పొడవుగా నిండినట్లు ఉంటుంది. తక్కువ కాలరీలు తీసుకోవడంలో సహాయపడుతుంది.

# సిపిఐ (యం -యల్) ప్రతిఘటన పార్టీ నుండి
# షాపురం గోపి అలియాస్ మధు బహిష్కరణ

**హైదరాబాద్ :** సిపిఐ (యం -యల్) ప్రతిఘటన పార్టీ నుండి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి షాపురం గోపి అలియాస్ మధు ని బహిష్కరించినట్లు సిపిఐ యం -యల్ ప్రతిఘటన పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మా పార్టీ సిపిఐ యం -యల్ ప్రతిఘటన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నిర్మించిన రాజకీయ, సిద్ధాంతాల పైన ఆధారపడి పనిచేస్తుంది. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి రచించిన డాక్యుమెంట్లకు అనుగుణంగా ఆచరణలో పెట్టి పార్టీని అభివృద్ధి చేయడం జరుగుతుంది. పార్టీ నిర్మాణానికి, పార్టీ పద్ధతులకు, పార్టీ క్రమశిక్షణ నైతిక విలువలకు కట్టుబడని వారిని ఉపేక్షించేది లేదు. తాగుబోతులకు, వ్యభిచారులకు పార్టీలో చోటు లేదు. విప్లవ పార్టీని తాగుబోతుల సంఘం గా మార్చడానికి షాపురం గోపి అలియాస్ మధు తీవ్రంగా ప్రయత్నం చేశాడు. నైతిక విలువలు లేని వారు ఎంతో కాలం పార్టీలో పని చేయలేరు. సిపిఐ ఎంఎల్ ప్రతిఘటన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ టి. మధుసూదన్ రాజ్ బ్రతికున్న కాలంలో నిజామాబాద్ జిల్లాలో పార్టీని విస్తరింప చేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి కానీ సరైన శక్తులు ఆ జిల్లాలో దొరకలేదు, కామ్రేడ్ వినోద్ అన్న నాయకత్వంలో 2000 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాలో పార్టీని రద్దు చేయడం జరిగింది. దీనికి ప్రధాన



కారణం అరాచకత్వం. అప్పటినుండి ఇప్పటిదాకా ఆ నిజామాబాద్ జిల్లాలో మా పార్టీ సిపిఐ యం -యల్ ప్రతిఘటన ఉనికి లేదు గత రెండు సంవత్సరాల క్రితం షాపురం గోపి అలియాస్ మధు, బోనుగుల లలిత మరియు ఎస్.కె సైదులు మా పార్టీ సిపిఐ యం -యల్ ప్రతిఘటనలో చేరారు. వీరు పార్టీ నిర్మాణానికి కట్టుబడి పని చేయడం లేదు. వీరు అరాచక వాదులు, వీరికి నైతిక విలువలు లేవు. మొత్తం మందుకు బానిసలు. కేవలం వీరు ప్రతిఘటన పార్టీ పేరు చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరిని ఎన్నోసార్లు మందలించడం జరిగింది. షాపురం గోపి అలియాస్ మధుకు కనీస రాజకీయ అవగాహన, రాజకీయ పరిజ్ఞానం లేదు. ఇతన్ని ఎన్నోసార్లు తన విధానాన్ని మార్చుకోమని చెప్పడం జరిగింది. వాస్తవంగా నిజామాబాద్ జిల్లాలో పార్టీ జిల్లా కమిటీ లేదు. పార్టీని మభ్యపెట్టి వసూళ్లకు పాల్పడుతున్నాడు. మధు ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు గాని పార్టీ కమిటీలు గాని లేవు కేవలం పత్రికా ప్రకటనలకు పరిమితమయ్యాడు. "మార్క్సిజం"స్వచ్ఛతను కాపాడుకుంటుంది అది చెడును విసర్జిస్తుంది" కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి లైను ను భ్రష్టు పట్టించడానికి ఇటువంటి భిన్నమైన, పార్టీకి వ్యతిరేకమైన ప్రకటనలు వస్తూ ఉంటాయి. ఇది మా పార్టీకి కొత్త కాదు. రాజ్యానికి అనుకూలమైన ప్రకటనలను లంపెంగ్ సెక్షన్ కు నాయకత్వం వహిస్తున్న షాపూరం గోపి అలియాస్ మధు ఇవ్వడాన్ని మా పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ఇటువంటివారిని ప్రజలు, విప్లవకారులు, సానుభూతిపరులు, ప్రజాస్వామికవాదులు నమ్మరాదని మా పార్టీ సిపిఐ యం -యల్ ప్రతిఘటన పార్టీ విజ్ఞప్తి చేసింది

# సింగరేణి సంస్థ ఆర్ జి త్రీ, ఏఎల్‌పిలలో గణతంత్ర దినోత్సవం

**కమాన్ పూర్ :** రామగిరి మండలం సెంటినరీ కాలనీలో నీ ఆర్ జి త్రీ పరిధిలో మరియు అడ్డాల లాగ్వాల్ ప్రాజెక్టులో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో జి.యం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలం దరికీ, స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం అందిస్తూ రూపొందిం చిన భారత రాజ్యాంగానికి 77 సంవత్సరాలు గడిచాయని, అందరము బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. తదుపరి స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ప్రధాన వేడుకల్లో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తదుపరి నిర్వహించిన కవాతు ప్రదర్శనలో భాగంగా ఏరియా సెక్యూరిటీ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవానికి ఒక ప్రత్యేకత ఉందని వందేమాతరం గీతాన్ని ఆలపించి నేటికీ 150 సంవత్సరాలు అయిందని, దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అందిస్తూ రూపొందించబడిన మన భారత రాజ్యాంగం 1950, జనవరి 26 న అమలులోకి వచ్చింద న్నారు. ప్రజలే పాలకులుగా రూపు దిద్దుకున్న మన భారత దేశానికి ఒక దశ, దిశ కల్పించడం కోసం రాజ్యాంగ రూపక ల్పన చేశారన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని రూపొందించిన కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించి, రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారిని మనం మరిచిపోలేమన్నారు. వారు దేశంలోని భిన్న నాగరికతలు, భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి, హక్కుల కోసమే కాకుండా, బాధ్యతలను కూడా తెలుసుకొని జీవించాలన్నారు. సింగరేణి సంస్థ యాజమాన్యం ఉద్యోగుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఉద్యోగి భద్రత తో వారి వారి స్థాయిలో బాధ్యతతో కూడిన విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా పని చేస్తేనే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజల కోసం ఎన్నో సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా, సంస్థ సామాజిక బాధ్యత క్రింద కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపా రు. అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గత సంవత్సరం విజిలెన్స్ అవగాహన వారత్సోవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కోల్ ఇండియా స్థాయిలో వివిధ విభాగాల్లో గెలుపొందిన వారిని సన్మానించారు. సెక్యూరిటీ సిబ్బందికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఎస్వోటు జియంలు యం. రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, సేవా సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి.. కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అనేక అబద్ధాలు, అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పక్కన పెట్టారు, పరిపాలన వదిలేశారని మండిపడ్డారు. చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత, మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇలా హామీలిచ్చి అందర్నీ మోసం చేస్తుందని ఆనాడే చెప్పామని.. అన్నట్లుగానే రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఏ ఒక్క వర్గాన్ని వదిలిపెట్టకుండా అందర్నీ మోసం చేశాడని



తెలిపారు. వృద్ధుల నుంచి మొదలు ఆడబిడ్డల వరకు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు.. ఇలా అందర్నీ రేవంత్ రెడ్డి మోసం చేస్తూనే ఉన్నాడని అన్నారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న అన్ని వర్గాలు ఈరోజు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. సనసభ స్పీకర్ ధృతరాష్ట్రుని లెక్క మారాడని.. కళ్ళకు గంతలు కట్టుకొని నిజాలు చూడలేకపోతున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో ,చేరి కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటే స్పీకర్ మాత్రం గుర్తించడం లేదని విమర్శించారు. యాదయ్య ఇంకా భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నాడని చెబుతున్నాడని పేర్కొన్నారు. కాలె యాదయ్య గెలిపించిన పార్టీని వదిలిపెట్టి పదవుల కోసం, పైసల కోసం కాంగ్రెస్ పార్టీలోకి పోయాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని యాదయ్య చెబుతున్నారు.. కానీ స్పీకరే ఒప్పుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే తమ పార్టీలో చేరిన కాలె యాదయ్యపై చర్యలు తీసుకొని.. ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం..

## టీ ఆర్ పీ జిల్లా అధ్యక్షులు రవి

**జయశంకర్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) తరపున పూర్తి స్థాయిలో పోటీ చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. గత పాలకులైన టిఆర్ఎస్ మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. ఎన్నికలు సమీపించగానే ప్రజలను మభ్యపెట్టేందుకు మళ్లీ దొంగ హామీలతో ముందుకు వస్తున్నారని విమర్శించారు. కావున ప్రజలు కాంగ్రెస్ గానీ, టిఆర్ఎస్ గానీ ఈ రెండు పార్టీలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. భూపాలపల్లిలో మెజారిటీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు టిఆర్పి పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని, తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. సామాన్యుడు కూడా కౌన్సిలర్‌గా పోటీ చేయగలిగే విధంగా టిఆర్పి పార్టీ అవకాశం కల్పిస్తుందని అన్నారు. ఇకపై ఆశావాహులు కాంగ్రెస్, టిఆర్ఎస్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, బీసీల, ఎస్సీల, ఎస్టీల, మైనారిటీల హక్కుల కోసం ఏర్పడిన టిఆర్పి పార్టీ మీ అందరినీ ఆహ్వానిస్తోందని తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పార్టీ మేనిఫెస్టో రూపొందించబడుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం భూపాలపల్లి మున్సిపాలిటీ దయనీయ స్థితిలో ఉందని, మళ్లీ పాత పాలకుల చేతికి అధికారాన్ని అప్పగిస్తే అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని హెచ్చరించారు. కావున విజ్ఞులైన ప్రజలు టిఆర్పి పార్టీని ఆదరించాలని, ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు



నేరుగా తనను సంప్రదించాలని రవి పటేల్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా నాయకులు రోడ్డ శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు మామిండ్ల మధుకర్ గౌడ్, జిల్లా నాయకుడు మామిడి శ్రీకాంత్, మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బోనగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద గూడెం తాండ నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**వనపర్తి :** వనపర్తి మండలం పెద్దగూడెం తండా రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సోమవారం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ప్రారంభించారుఈ సందర్భంగా ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నుకోబడ్డ శ్రీ వాళ్య నాయక్ ని సర్పంచ్ చాంబర్లో శాలువాలు పూలమాలలతో సత్కరించి సన్మానించారు. గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు పనిచేయాలని, పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని వారు సూచించారు గ్రామాభివృద్ధికి కావలసిన పనుల మంజూరిలో ఎల్లవేళలా సహకరిస్తామని ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారుకార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, మండలాధ్యక్షుడు రవి కిరణ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మార్కెట్ మాజీ అధ్యక్షులు ఎత్తం రవి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామస్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు
## జాతీయ జెండాను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ. దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడటంలో ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో పనిచేయాలని,ప్రజల భద్రతే లక్ష్యంగా, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను జోడించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు:కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం, కమిషనర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ పోలీసు దళాల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె. హైమవతి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ కె.హైమవతి కమిషనర్ చేత ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ వేడుకల్లో అదనపు డీసీపీ ఎ ఆర్. సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్ లు,ఎస్ ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు
## జాతీయ జెండాను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ. దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడటంలో ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో పనిచేయాలని,ప్రజల భద్రతే లక్ష్యంగా, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతికతను జోడించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

**పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు..**

కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం, కమిషనర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ పోలీసు దళాల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ కె. హైమవతి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ కె.హైమవతి కమిషనర్ చేత ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ వేడుకల్లో అదనపు డీసీపీ ఎ ఆర్. సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్ లు,ఎస్ ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత

**రంగారెడ్డి :** హైదరాబాద్ నగరం తరహాలో జీహెచ్ఎంసి లో విలీనం అయిన జల్ పల్లి, ఫహాడిషరీఫ్, షహీన్నగర్ డివిజన్లను అభివృద్ధి చేస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇవాళ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాతబస్తీలో అయన విస్తృతంగా పర్యటించారు ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన జెండా వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో చిన్నారులు... కిచ్చెన్నగారికి ఘన స్వాగతం పలికారు. వారిని అప్యాయంగా దగ్గరకు తీసుకుని ఉన్నత చదువులు చదివి గొప్ప గొప్ప ఉద్యోగాలు చేయాలని ఆశీర్వాదించారు. రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు, మంచినీటి వసతులు కల్పించి పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ఎంత ఖర్చు అయినా.... కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గారు వెనకడుగు వేయబోరని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా అందరం కలిసి మెలిసి ఉండాలని... భారత రాజ్యాంగం కల్పించిన స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు వర్గాలకు అందేలా కాంగ్రెస్ నాయకత్వం చర్యలు తీసుకుంటుందని కిచ్చెన్న తెలిపారు. అహింస వాదంతో బ్రిటీషర్స్ ను తరిమేశాక స్వయం పాలన కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు అత్యున్నత రాజ్యాంగాన్ని మనకు అందించారని లక్ష్మారెడ్డి కొనియాడారు. ఈకార్యక్రమంలో జల్ పల్లి, ఫహాడిషరీఫ్, షహీన్నగర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
## - జెండా ఆవిష్కరించిన జీయర్ స్వామీజీలు

**రంగారెడ్డి :** గణతంత్ర దినోత్సవం కేవలం పండుగ మాత్రమే కాదు మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, వైవిధ్యంలో ఐక్యతను సాధించాలనే బాధ్యతను గుర్తు చేసే పవిత్ర దినంగా శ్రీ రంగరామానుజ స్వామివారు వర్ణించారు . శ్రీ అహోబిల జీయర్ స్వామివారు మాట్లాడుతూ ఇది భారత ఆత్మను ప్రతిబింబించే జాతీయ పండుగని కొనియాడారు. "మన రాజ్యాంగ నిర్మాణానికి ప్రజాస్వామ్యమే పునాది. ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల ద్వారా పాలనను అందించడానికి ఇది మార్గ నిర్దేశం చేస్తుంది. ఈ పవిత్ర దినాన... న్యాయం, సమానత్వం, సోదరభావం వంటి విలువలను మరింత పరిరక్షించడానికి పునరంకితమవుతూ ముందుకు సాగాలి. ఇవే ఒక బలమైన దేశానికి మూల స్థంభాలు." అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమములో శ్రీ దేవనాథ జీయర్ స్వామివారు మాట్లాడుతూ మన జీవా ప్రాగణంలో ఈ నెల 21న జరికిన వ్యాస రచన పోటీలలో ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో విలువల జాగృతి కై ప్రత్యేక జరిగిన వ్యాస, వక్తృత్వ పోటీల ఫలితాలు జీయర్ స్వాములు విడుదల చేసారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలో

**ఫైనల్స్ విజేతలు**

జెడ్పీహెచ్ఎస్ ఆసిఫ్నగర్ విద్యార్థిని 1వ స్థానం డి. లక్ష్మి శ్లోక వక్తృత్వ విభాగంలో గెలుచుకున్నారు 2వస్థానం : అగస్తిరాథోడ్ గెలుచుకున్నారు.

వ్యాసరచన విభాగంలో విద్యార్థిని జూ.మేధా 1వ స్థానం గెలుచుకున్నారు, విద్యార్థిని వేదం 2వస్థానం గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన 132 విద్యార్థులు హైదరాబాద్లోని జీయర్ స్వామి వారి ఆశ్రమంలో రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు . రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు స్వయంగా చిన్నజీయర్ స్వామివారి చేతుల మీదుగా ప్రదానం చేయబడనున్నాయి... నేత్ర విద్యాలయం స్టూటెంట్స్ చేసిన ఎన్సిసి పెరేడ్ అందరిని మెప్పించింది. ఈ కార్యక్రమంలో జీన్స్ మెడికల్ కాలేజ్ నేత్ర విద్యాలయం స్టూటెంట్స్ మరియు జీవా గురుకులం వేద విద్యార్థులు పాల్గొన్నారు

## బిజినెస్

### మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు



భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. 2025 మధ్యలో 2 మిలియన్ బ్యారెళ్లతో పోలిస్తే దిగుమతులు గణనీయంగా తగ్గాయి. ఈ క్రమంలో భారత్ ఇరాక్, సౌదీ అరేబియా వంటి మధ్యప్రాచ్య దేశాల నుంచి ఎక్కువ చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది. ఇరాక్ ఇప్పుడు రష్యా మాదిరిగానే దాదాపు అదే మొత్తంలో చమురును సరఫరా చేస్తోంది. మరోవైపు, సౌదీ అరేబియా ఎగుమతులు కూడా బాగా పెరిగాయి. 2022 నుంచి చౌక ధరల కారణంగా రష్యా భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా మారినప్పటికీ, ఇటీవలి ఆంక్షలు షిప్పింగ్, బీమా, చెల్లింపులను మరింత క్లిష్టతరం చేశాయి. దీని కారణంగా, భారత శుద్ధి సంస్థలు రష్యన్ చమురును కొనుగోలు చేయడంలో ఎక్కువ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి.

### త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం





డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో గ్లోబల్ టెక్ దిగ్గజం, ఐఫోన్ బ్రాండ్‌కు చెందిన యాపిల్ కూడా భారత డిజిటల్ చెల్లింపుల మార్కెట్లోకి అడుగుపెట్టాలని భావిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తరహాలోనే ఇతర కంపెనీల కంటే బాగా ఆలస్యంగా ఇందులోకి ప్రవేశిస్తోంది. ప్రస్తుతానికి యాపిల్ పేని భారత్‌లో ప్రారంభించేందుకు యాపిల్ కంపెనీ బ్యాంకులు, క్రెడిట్ కార్డు కంపెనీలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. యాపిల్ పే మొదట డెబిట్, క్రెడిట్ కార్డులకు అనుమతించాలని భావిస్తోంది. ఆ తర్వాత ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత యూపీఐ చెల్లింపులను యాడ్ చేసే అవకాశం ఉంది. అన్ని ప్రక్రియలు విజయవంతమైతే ఈ ఏడాది ఆఖరు నాటికి డిజిటల్ చెల్లింపుల సేవలను ప్రారంభించవచ్చని తెలుస్తోంది.

# సంచలన నిర్ణయం.. టీసీఎల్ చేతికి సోనీ టీవీలు!




ఎలక్ట్రానిక్స్ ప్రపంచంలో ఒక పెద్ద సంచలనం వచ్చింది. టీసీఎల్, సోనీ కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే ఇక సోనీ టీవీలు టీసీఎల్ చేతిలోకి వెళ్లిపోతున్నాయి. అయితే ఈ ఒప్పందం కుదిరినా.. ఎప్పట్లాగే వాటి బ్రాండ్లు కొనసాగనున్నాయని ప్రకటించాయి. వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ ప్రపంచంలో ఒక పెద్ద సంచలనంలో సోనీ గ్రూప్ కార్పొరేషన్ తన టీవీ వ్యాపారాన్ని విభజించాలని ప్రణాళికలు ప్రకటించింది. కంపెనీ తన హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో 51 శాతం వాటాను చైనీస్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ౧అఒ ఎలక్ట్రానిక్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు విక్రయిస్తోంది. మిగతా 49 శాతం సోనికి ఉంటుంది. ఈ మైలురాయి ఒప్పందం తర్వాత రెండు కంపెనీలు జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తాయి. ఇది ఏప్రిల్ 2027లో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ చర్య జపనీస్ కంపెనీలు తక్కువ లాభదాయక టెలివిజన్ హార్డ్‌వేర్ విభాగంపై ఆధారపడటంలో మార్పును ప్రతిబింబిస్తుంది. సోనీ ఇప్పుడు తన దృష్టిని సాంప్రదాయ ఎలక్ట్రానిక్స్ నుండి ప్లేస్టేషన్ వంటి అధిక-వృద్ధి, మరింత లాభదాయక విభాగాలకు మారుస్తోంది. భవిష్యత్ టీవీలు 'సోనీ', 'బ్రావియా' బ్రాండింగ్‌ను నిలుపుకుంటాయి. ఈ ఏర్పాటు ప్రపంచ మార్కెట్లో తన బలమైన బ్రాండ్ ఉనికిని కొనసాగించడానికి, టీవీ తయారీకి సంబంధించిన అధిక ఖర్చులు, తక్కువ లాభదాయకత సవాళ్లను తగ్గించడానికి సహాయపడుతుందని సోనీ చెబుతోంది. సోనీ అధ్యక్షుడు, అఖా కిమియో మాకి ప్రకారం, వినియోగదారులకు మరింత మెరుగైన వీక్షణ అనుభవాన్ని అందించడానికి రెండు కంపెనీల నైపుణ్యాన్ని మిళితం చేయడమే ఈ భాగస్వామ్యం లక్ష్యమన్నారు. ఈ వ్యూహాత్మక ఒప్పందంలో టిఎన్‌వై ఈ జాయింట్ వెంచర్‌కు నాయకత్వం వహిస్తుంది. 51% మెజారిటీ వాటాను కలిగి ఉంటుంది. స్థిరమైన వృద్ధికి ఈ భాగస్వామ్యాన్ని బలమైన పునాదిగా ౧అఒ ఛైర్మన్ డు జువాన్ అభివర్ణించారు. ఈ ఒప్పందం సోనీ హార్డ్‌వేర్ ఆధారిత వ్యాపార నమూనా నుండి సాఫ్ట్‌వేర్, సేవల ఆధారిత వ్యాపార నమూనాకు మారడానికి సహాయపడుతుందన్నారు. టీసీఎల్, సోనీ కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నా.. ఎప్పట్లాగే వాటి బ్రాండ్లు కొనసాగనున్నాయని ప్రకటించాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముడవుతున్న సోనీ, టీసీఎల్ టెలివిజన్లు అలాగే అమ్మకానికి ఉంటాయి. టీవీ సెగ్మెంట్ నుంచి సోనీ బయటకు వెళ్లిపోవట్లేదు. కానీ నేరుగా ఇకపై ఈ టీవీల వ్యాపారాన్ని సోనీ నిర్వహించదని చెబుతున్నారు. ఈ బాధ్యత టీసీఎల్ చూసుకుంటుంది. అయితే సోనీ బ్రాండ్ ముఖ్యంగా బ్రావియా టీవీలు, హోమ్ ఆడియో ఉత్పత్తులకు కస్టమర్ కేర్ అంతా టీసీఎల్ చూసుకోనున్నట్లు తెలుస్తోంది. టెక్నాలజీ, ఇతరత్రా అంశాల్లో సోనీ మద్దతు టీసీఎల్‌కు ఉంటుందని తెలుస్తోంది.

## యూపీఐ యాప్స్ వాడేటప్పుడు ఈ తప్పులు చేస్తున్నారా..?




యూపీఐ యాప్స్ వాడుతున్నారా..? అందులో లభించే యూపీఐ క్రెడిట్‌ను తెగ వాడేస్తున్నారా..? అయితే మీరు అప్పుల్లో చిక్కుకోవడం గ్యారంటీ. చిన్న షాపుల దగ్గర రూ.10, రూ.20 అని క్రెడిట్‌ను వాడుకుంటే ఆర్థిక భారం పెరుగుతుంది. నెల చివరి నాటికి అది మరింత భారమవుతుంది. ఈ రోజుల్లో ప్రతీఒక్కరూ యూపీఐ యాప్‌లు వాడుతున్నారు. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న వారందరి ఫోన్లల్లో యూపీఐ యాప్‌లు ఖచ్చితంగా ఉంటున్నాయి. ప్రస్తుత మార్కెట్లో అనేక యూపీఐ ప్లాట్‌ఫామ్స్ ఉన్నాయి. అనేక కంపెనీలు కొత్తగా మరికొన్ని యాప్స్‌ను తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశంలో యూపీఐ యాప్స్ వాడకం నానాటికి పెరుగుతూనే ఉంది. ప్రతీ ఏడాది రికార్డు స్థాయిలో యూపీఐ ట్రాన్సాక్షన్లు పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. సెకన్ల వ్యవధిలోనే బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం, పేమెంట్స్ చేయడం వంటి సౌకర్యాలు ఉండటంతో బ్యాంకు వినియోగదారులందరూ యూపీఐ యాప్స్ వాడుతున్నారు. బ్యాంకులు స్వయంగా తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్స్‌లో యూపీఐ సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నాయి. అయితే యూపీఐ ద్వారా మనం పేమెంట్స్ చేయాలన్నా లేదా వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నా మన అకౌంట్లో డబ్బులు ఉండాలి. కానీ అకౌంట్లో డబ్బులు లేకపోయినా వినియోగదారులు పేమెంట్స్ చేసేందుకు వీలుగా క్రెడిట్ లైన్‌ను జారీ చేస్తున్నాయి యాప్‌లు. అంటే యాప్‌లే అప్పుగా డబ్బులు ఇస్తున్నాయి. చాలామంది ఈ ఫెసిలిటీని వాడుకుంటున్నారు. కొంతమంది వీటికి అలవాటు క్రెడిట్ లైన్‌ను విపరీతంగా ఉపయోగించుకుంటున్నారు. చిన్న చిన్న దుకాణాల వద్ద కాకుండా ఏదైనా అవసరాలకు వీటి ద్వారానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్ చేస్తున్నారు. ఇలాంటి చిన్న పేమెంట్స్ వల్ల నెల చివరి నాటికి ఆర్థిక భారం పెరుగుతుంది. దీంతో దీని వల్ల అప్పుల ఊబిలోకి వెళ్లే అవకాశముందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ లైన్‌ను ఎక్కువగా వాడుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

# ఇండియా-పాక్ మ్యాచ్ లేనట్లేనా.. టీ20 వరల్డ్ కప్‌ను పాకిస్తాన్ బహిష్కరిస్తుందా?



టీ20 వరల్డ్ కప్ 2026లో పాల్గొనే అంశంపై పాకిస్తాన్ ఇంకా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఐసీసీ హెచ్చరించిన తర్వాత కూడా పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) వైఖరిలో మార్పు రానట్లు కనిపిస్తోంది. టోర్నీలో పాల్గొనే అంశంపై ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది. టోర్నీ నుంచి బంగ్లాదేశ్‌ను ఐసీసీ తొలగించి, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. దీంతో బంగ్లాకు మద్దతుగా తాము కూడా టోర్నీలో పాల్గొనే అంశంపై ఆలోచిస్తామని, తమ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటామని పాక్ ఐసీసీకి తెలిపింది.

దీనికి స్పందించిన ఐసీసీ.. టోర్నీలో పాల్గొనకుంటే పాక్‌పై తీవ్ర ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. దీంతో స్పందించిన పాక్.. టీ20 జట్టును ప్రకటించింది. ఇక.. టోర్నీలో పాక్ గ్యారెంటీగా ఆడుతుందని అంతా అనుకుంటుండగా.. ఇక్కడే మెలిక పెట్టింది. తాము జట్టును మాత్రమే ప్రకటించామని.. దానర్థం టోర్నీలో తప్పకుండా ఆడుతామని కాదని పాక్ క్రికెట్ వర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో పాకిస్తాన్ రెండు ఆప్షన్లు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి.. బంగ్లాకు మద్దతుగా టోర్నీని పూర్తిగా బహిష్కరించడం. రెండోది ఇండియాతో జరిగే మ్యాచును మాత్రమే బహిష్కరించడం. ఈ రెండిట్లో ఏదో ఒకటి చేయాలని చూస్తోంది. మరోవైపు టోర్నీలో పాల్గొనడంపై అక్కడి ప్రభుత్వ అనుమతి కోసం పాక్ జట్టు ఎదురుచూస్తోంది. పాక్ ప్రభుత్వం సూచిస్తే టోర్నీని వీడేందుకు పాక్ సిద్ధంగా ఉంది. ఇండియాలో టోర్నీ జరుగుతుండటమే బంగ్లా, పాక్ ఒత్తిడికి కారణం. ఇప్పటికే పాకిస్తాన్ ఆడే మ్యాచుల్ని శ్రీలంకలో నిర్వహించనుండగా.. తాము కూడా ఇండియాకు రాలేమని, తమకు కూడా మరో వేదిక కావాలని బంగ్లా డిమాండ్ చేసింది. కానీ, దీనికి ఐసీసీ ఒప్పుకోకుండా.. స్కాట్లాండ్‌ను రంగంలోకి దించింది. ఇండియా-పాక్ మధ్య ఫిబ్రవరి 15న శ్రీలంకలోని కొలంబోలో మ్యాచ్ జరగనుంది.

### అండర్-19 క్రికెట్‌లో ఆణిముత్యం.. మరో హార్దిక్ పాండ్యా అవుతాడా?



జింబాబ్వే వేదికగా అండర్-19 వరల్డ్‌కప్ టోర్నమెంట్-2026లో భారత యువ జట్టు వరుస విజయాలతో జోరు మీద ఉంది. తొలి మ్యాచ్‌లో అమెరికా జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించిన ఆయుశ్ మాత్రే సేన.. తదుపరి బంగ్లాదేశ్‌పై 18 పరుగుల తేడాతో గెలిచింది.

చివరగా శనివారం నాటి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడ్డ యువ భారత్.. డీఎల్ఎస్ పద్ధతిలో ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. కివీస్ యువ జట్టుతో మ్యాచ్‌లో భారత ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీశ్ (=ా ాూఎఎతీఱంష్ట్ర) కీలక పాత్ర పోషించాడు.

నాలుగు వికెట్లతో సత్తా చాటి

ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో సత్తా చాటి న్యూజిలాండ్ అండర్-19 జట్టు బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించాడు. ఈ నేపథ్యంలో అంబరీశ్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. పద్దెమినిదేళ్ల ఈ కుర్రాడు ఇలాగే అద్భుత ప్రదర్శనలతో ముందుకు సాగితే టీమిండియాకు మరో హార్దిక్ పాండ్యా దొరికినట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మరో హార్దిక్ పాండ్యా అవుతాడా?

హార్దిక్ మాదిరి ఆరో స్థానంలో చక్కగా బ్యాటింగ్ చేయడంతో పాటు.. కొత్త బంతితో బౌలింగ్ చేయగల సత్తా కలిగి ఉండటం ఇందుకు కారణం. తమిళనాడుకు చెందిన ఆర్ఎస్ అంబరీశ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్. ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన అతడు.. రైటార్మ్ ఫాస్ట్ మీడియం పేసర్.

**తండ్రి కల నెరవేరుస్తున్న తనయుడు**

కూచ్ బెహర్ ట్రోఫీలో తమిళనాడు కెప్టెన్‌గా వ్యవహరించిన అంబరీశ్.. 33 ఏళ్ల నిరీక్షణ తర్వాత జూనియర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో జట్టుకు ట్రోఫీని అందించాడు. అతడి తండ్రి ఆర్. సుకుమార్ కూడా క్రికెటరే. జూనియర్ క్రికెట్‌లో కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. ఆ తర్వాత రైల్వేస్ జట్టుకు మారిన సుకుమార్ సీనియర్ జట్టులో చోటు సంపాదించలేకపోయాడు.

## స్పోర్ట్స్

### పొట్టి సిరీస్‌కు దూరమైన తిలక్.. ప్రపంచకప్ లోపు సుందర్ కోలుకునేనా!



టీ20 ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను హ్యాట్రిక్ విజయాలతో కైవసం చేసుకున్న భారత జట్టుకు షాకింగ్ న్యూస్. సర్జరీ కారణంగా తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైన తిలక్ వర్మ తిలక్ వర్మ ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదు. చివరి రెండు మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉంటాడని ఆశించిన టీమిండియాకు నిరాశే మిగిలింది. న్యూజిలాండ్‌తో చివరి రెండు మ్యాచ్‌ల్లో సైతం తిలక్ ఆడడం లేదని సోమవారం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వెల్లడించింది. దాంతో.. ఆసియా కప్ హీరో స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్ టీమ్‌తోనే ఉండనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో గాయపడిన తిలక్ వర్మ జట్టుకు దూరమయ్యాడు. సర్జరీ తర్వాత కోలుకుంటున్న ఆసియా కప్ హీరో పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. ' సర్జరీ నుంచి కోలుకున్న తిలక్ వ్యాయామాలు చేస్తున్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిపుణుల పర్యవేక్షణలో అతడి రోజురోజుకు మెరుగవుతున్నాడు. అయితే.. మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు తిలక్‌కు మరికొంత సమయం పట్టనుంది. కాబట్టి.. అతడు చివరి రెండు టీ20లకు అందుబాటులో ఉండడు. ఫిబ్రవరి 3లోపు పూర్తిస్థాయిలో ఫిట్‌గా మారితే వామప్ మ్యాచ్, ప్రపంచకప్ కోసం భారత స్క్వాడ్‌తో కలుస్తాడు' అని బీసీసీఐ వెల్లడించింది. తిలక్ బదులు మూడో స్థానంలో అవకాశం దక్కించుకున్న ఇషాన్ కిషన్ చెలరేగుతున్నాడు. రాయ్‌పూర్‌లో మెరుపు అర్ధ శతకంతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు.. గువాహటిలో ఉన్నంత సేపు సిక్సర్లతో హోరెత్తించాడు. ఒకవేళ తిలక్ వర్మ ఫిట్‌నెస్ సాధించినా.. ఫామ్ దృష్ట్యా ఇషాన్‌కే వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశం దక్కనుందని టాక్. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్వాషింగ్టన్ సుందర్ ఆరోగ్యంపై కూడా అప్‌డేట్ ఇచ్చింది భారత బోర్డు. 'పక్కటెముకల గాయంతో ఇబ్బంది పడుతున్న సుందర్ వైద్యులు సూచన మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆరోగ్యం మెరుగయ్యాక అతడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరుతాడు' అని బీసీసీఐ తెలిపింది. వడోదర వన్డేలో గాయపడిన సుందర్ ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువకెరటం రవి బిష్ణోయను ఎంపిక చేశారు. తొలి రెండు మ్యాచుల్లో బెంచ్‌కే పరిమితమైన బిష్ణోయ్.. గువాహటిలో చెలరేగాడు. రెండు బిగ్ వికెట్లు తీసిన అతడు 18 పరుగులే ఇచ్చి కివీస్‌ను 153కే కట్టడి చేయడంలో కీలకమయ్యాడు. టీ20 స్క్వాడ్ : సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(తొలి మూడు టీ20లకు), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్(వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రానా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్.



# కార్తీ ఖైదీ 2 ఆన్ ది వే.. లోకేశ్ కనగరాజ్ అఫీషియల్ అప్‌డేట్..!

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ తన నెక్ట్స్ చిత్రాన్ని అల్లు అర్జున్‌తో చేస్తున్నట్టు ప్రకటించాడని తెలిసిందే. ఈ చిత్రం రానుంది. కాగా మరోవైపు కార్తీ టైటిల్ రోల్ పోషించిన బ్లాక్ బస్టర్ ఖైదీ చిత్రానికి సీక్వెల్ ఖైదీ 2 అప్‌డేట్ ఇప్పటికే రావాల్సి ఉండగా.. ఈ మూవీ అటకెక్కినట్టేనంటూ ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. మూవీ లవర్స్‌తోపాటు కార్తీ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఖైదీ 2 అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది. డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ ఇటీవలే మీడియాతో చిట్ చాట్ సెషన్‌లో ఖైదీ 2 గురించి క్లారిటీ ఇచ్చేశాడు. ఘూ23 తర్వాత చేయబోయే సినిమా ఇదేనని చెప్పాడు. కమల్ హాసన్, రజినీకాంత్‌తో సినిమా చేయాల్సి ఉండగా.. కథ విషయంలో తేడాలు రావడంతో వర్కవుట్ కాలేదు. అంతేకాదు అదే సమయంలో కార్తీ వేరే సినిమాకు కమిట్ మెంట్ ఇవ్వడంతో డేట్స్ కారణంగా ఖైదీ 2ను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సాధ్యం కాలేదన్నాడు. లోకేశ్ కనగరాజ్ అనుకున్న ప్లాన్ ప్రకారం అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఈ చిత్రం 2027లో సెట్స్‌పైకి వెళ్లనుందని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు సూర్యతో చేయబోయే స్టాండలోన్ రోలెక్స్ సినిమా కూడా లోకేశ్ కనగరాజ్ లైనప్‌లో ఉంది.



## మంచు మనోజ్ నుంచి మరో పవర్ ఫుల్ ట్రాన్స్‌ఫర్మేషన్.. 'డేవిడ్ రెడ్డి' ఫస్ట్ లుక్‌తో హై వోల్టేజ్ హైప్

'భైరవం', 'మిరాయ్' లాంటి సక్సెస్‌లతో మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చిన మంచు మనోజ్.. ఇప్పుడు కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్ ఖరారైంది. తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ లుక్ పూర్తిగా షాక్ ఇచ్చేలా ఉంది. చేతిలో ఆయుధం, కళ్లలో ప్రతీకారం, ముఖంలో క్రూరత్వండ ఓ భారీ యాక్షన్ సీన్ బ్యాక్‌డ్రాప్‌లో కనిపించిన మనోజ్ ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లుక్‌ను షేర్ చేస్తూ మనోజ్ "ఇది నాలో ఇప్పటివరకూ బయటకు రాని ఒక వైపు. ఎలాంటి కరుణ లేని పాత్ర" అంటూ ఆసక్తికర క్యాప్షన్ ఇచ్చారు. 'డేవిడ్ రెడ్డి' కథ బ్రిటీష్ పాలన కాలంలో జరుగుతుంది. 1897 నుంచి 1922 మధ్య జరిగిన సంఘటనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. హీరో పాత్ర ఫిక్షనల్ అయినప్పటికీ, సామాజిక అణచివేతలు, కుల వివక్ష, బ్రిటీష్ అణచివేతకు ఎదురొడ్డి నిలబడిన ఓ రెబల్ యోధుడి ప్రయాణమే ఈ సినిమా మూలకథ. స్వాతంత్ర్యం అడిగి కాదు.. పోరాడి తెచ్చుకోవాలి అనే సిద్ధాంతంతో ముందుకెళ్లే పాత్రగా మనోజ్ కనిపించనున్నారు. ఈ సినిమాలో మనోజ్ వాడే భారీ బైక్ 'వార్ డాగ్' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దాదాపు 700 కేజీల బరువు ఉన్న ఈ బైక్‌తో పాటు, ఆయన చేతిలో ఉండే స్టిక్‌ను 'డెత్ నోట్'గా వర్ణిస్తున్నారు. ఇవే డేవిడ్ రెడ్డి ప్రధాన ఆయుధాలు అని దర్శకుడు వెల్లడించారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మోతుకూరి భరత్, నల్లగంగుళ వెంకట్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా మరియా నటిస్తున్నారు. తెలుగు తో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో సినిమాను రిలీజ్ చేయనున్నారు. చరిత్ర పుస్తకాల్లో కనిపించని కొన్ని దారుణ సంఘటనలు, వాటిని ఎదుర్కొనేందుకు ఒక వ్యక్తి ఎంత తీవ్రంగా పోరాడితే ఎలా ఉంటుందనే అంశాన్ని 'డేవిడ్ రెడ్డి' చూపించనుందని మనోజ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఫస్ట్ లుక్‌తోనే ఆ మాటలకు బలం చేకూరింది. మొత్తానికిడ మంచు మనోజ్ కెరీర్‌లోనే మోస్ట్ వైలెంట్, మోస్ట్ ఇంటెన్స్ పాత్రగా 'డేవిడ్ రెడ్డి' నిలవబోతోందన్నది ఫస్ట్ లుక్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది.

# పక్కా విలేజ్ మాస్ అవతార్‌లో తిరువీర్.. ఓ సుకుమారి లుక్ వైరల్

2025లో ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చి మంది సక్సెస్ అందుకున్నాడు తిరువీర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన తిరువీర్ భరత్ భూషణ్ డైరెక్షన్‌లో సినిమాను ప్రకటించాడని తెలిసిందే. ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఓ సుకుమారి టైటిల్‌తో వస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే ఐశ్వర్యా రాజేశ్ స్పిరిటెడ్ దామిని ఫస్ట్ లుక్ నెట్టింట వైరల్ అవుతుంది. తాజాగా తిరువీర్ పోషిస్తున్న లుక్‌ను షేర్ చేశారు. ఇందులో యాదగిరి పాత్రలో నటిస్తున్నాడు తిరువీర్. కర్లీ హెయిర్‌తో లుంగీ, బనియన్ మెడలో టవల్‌తో బ్రష్ వేసుకుని నడుచుకుంటూ వస్తున్న స్టిల్ న్యాచురల్‌గా కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ మూవీని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 19 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రానికి భరత్ మాచిరాజు సంగీతం అందిస్తున్నాడు. రజాకార్, పొలిమేర సినిమాలకు పనిచేసిన సీహెచ్ కుశేందర్ సినిమాటోగ్రఫర్ కావడంతో సినిమాపై హైప్ పెరిగిపోతుంది. ఈ మూవీ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటిదాకా తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన తిరువీర్ ఈ సినిమాతో ఇక సౌతిండియాలో మార్కెట్ పెంచుకోబోతున్నాడన్నమాట.




# ఆ మూవీ ఫ్లాప్.. నన్ను చూసి అమ్మ జాలి పడింది



తెలుగు హీరోల్లో విశ్వక్ సేన్ ఒకడు. 'ఈ నగరానికి ఏమైంది?' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు గానీ తర్వాత తర్వాత అనుకున్నంతగా సక్సెస్ అందుకోలేకపోయాడు. గతేడాది రిలీజైన 'లైలా' మూవీతో ఘోరాతీ ఘోరంగా ఫ్లాప్ అయింది. ఇప్పుడు 'ఫంకీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయిపోయాడు. ఈ సందర్భంగా ప్రమోషనల్ ఇంటర్వ్యూ వదిలారు. ఇందులో మాట్లాడిన విశ్వక్.. డైరెక్టర్ అనుదీప్ గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. "ఫంకీ'లో రొమాంటిక్ సీన్స్ పీక్స్‌లో ఉంటాయి. ఎక్స్‌ట్రీమ్ అసలు. అదేంటో గానీ మేం సీన్స్ చేస్తుంటే.. మానిటర్ ముందు కూర్చున్న అనుదీప్ చాలా ఇబ్బందిగా అయిపోయాడు. చెప్పాలంటే బిగుసుకుపోయేవాడు' అని విశ్వక్ సేన్ చెప్పాడు. ఇదే విషయం గురించి హీరోయిన్ కాయదు లోహర్ మాట్లాడుతూ.. రొమాంటిక్ సీన్ జరుగుతుంటే మధ్యలో అనుదీప్ కట్ చెప్పేసేవాడు. మేమే ఎలాగోలా దాన్ని పూర్తి చేసేవాళ్లం అని చెప్పుకొచ్చింది. 'లైలా' ఫ్లాప్ గురించి మాట్లాడిన విశ్వక్ సేన్.. నా ప్రతి సినిమా చూసే అమ్మ, అది యావరేజ్‌గా ఉన్నా తెగ పొగిడేసేది. 'లైలా'కి మాత్రం వింత అనుభవం ఎదురైంది. మూవీ చూసొచ్చిన తర్వాత నన్ను జాలిగా చూసింది అని చెప్పాడు. 'ఫంకీ' విషయానికొస్తే.. మూవీ డైరెక్టర్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ఫిబ్రవరి 13న థియేటర్లలోకి వస్తోంది.

## ఐటం పాటల ట్రెండ్‌కు బ్రేక్.. రష్మిక మందన్నా పెట్టిన షరతులు ఇప్పుడు హాట్ టాపిక్



ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నా రు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు "హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు" అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు దర్శకులు ఎవరో మాత్రం ఇప్పుడే వెల్లడించలేనని, సరైన సమయంలో తానే చెబుతానని చెప్పిందట. దీంతో రష్మిక ఐటం పాటల విషయంలో స్పష్టమైన హద్దులు పెట్టుకున్నారనే చర్చ మొదలైంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com